# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888



**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం RNI No:/2023/87888

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి 9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -355 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 13 ఏప్రిల్ 2026


# చర్చలు విఫలం



**అమెరికావి గొంతెమ్మ కోరికలు..ఇరాన్**

**మా నిబంధనలను ఇరాన్ అంగీకరించలేదు : జేడీ వాన్స్**


**లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు..ఆరుగురు మృతి**

**తదుపరి పరిణామాలపై ఉత్కంఠ**

**ఇస్లామాబాద్ :** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి శాంతిని నెలకొల్పేందుకు ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యా యి. సహేతుకం కాని డిమాండ్లను ముందుకు తెచ్చారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. తమ నియమ నిబంధనలకు ఇరాన్ అంగీకరించలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పగా అమెరికా చేసిన అర్థం పర్థం లేని డిమాండ్ల కారణంగానే చర్చలు విఫలమయ్యాయని**మిగతా 2లో...**

# మూగబోయిన గానకోకిల

## ప్రముఖ గాయని ఆశా భోస్లే (92) కన్నుమూత



**బహుళ అవయవాల వైఫల్యంతో తుదిశ్వాస విడిచిన గానకోకిల**

**ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రకటన**

**సోమవారం శివాజీ పార్క్ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఆశా భోస్లే (92) కన్నుమూయడంతో భారతీయ సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె తుదిశ్వాస విడిచారు. (ఏప్రిల్ 13) ఆమె అంత్యక్రియలను ముంబైలో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర మంత్రి అశీష్ షెలార్ ప్రకటించారు**మిగతా 2లో...**

# ఏపీలో నవశకం

# ప్రారంభం

## రేపే వరల్డ్ క్వాంటం డే...

**భారత క్వాంటం రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు**

**అమరావతిలో 1ూ, 1ు క్వాంటం టెస్ట్ బెడ్ల ఏర్పాటు**

**ఏప్రిల్ 14న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

**దేశంలోనే తొలి క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ ఇదే**

**సంపూర్ణ స్వదేశీ టెక్నాలజీతో వీటి నిర్మాణం**



**అమరావతి : ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
భారత క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో రెండు కీలక క్వాంటం టెస్ట్ బెడ్లను ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధా టవర్స్, రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ చరిత్రాత్మక ఘట్టంతో, దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీని **మిగతా 2లో...**

# హార్ముజ్‌ను దిగ్బంధించండి

**అమెరికా నావిక దళానికి ట్రంప్ ఆదేశాలు**



2లో.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన సేవలు**

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఎండో బ్రాంకియల్ ఆల్ట్రా సౌండ్ మెషిన్ ప్రారంభం**



**విశాఖపట్నం ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం పెదవాల్తేరులోని ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఎండో బ్రాంకియల్ ఆల్ట్రా సౌండ్ మెషిన్ (ఈబస్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా మిషన్ మొట్టమొదటిదని, దీనివల్ల ఈ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం ఆస్పత్రుల్లో సదుపాయాలను మెరుగుపరిచామని, దీంతో ఓపీ, ఐపీ సేవలు గణనీయ**మిగతా 2లో...**

# ఇంటర్‌లో బాలికలదే హవా

**ప్రతిభ చాటిన ప్రభుత్వ విద్యాసంస్థలు**

**ఫలితాలు విడుదల చేసిన కె.కేశవరావు**

**ఫస్టియర్‌లో 66.20 శాతం, సెకండియర్‌లో 75.34 శాతం**

**రెండేండ్ల ఉత్తీర్ణత శాతం 70.60**

**మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**




**హైదరాబాద్ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఈసారి బాలికలే పైచేయి సాధించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు సత్తా చాటాయి. 16 రకాల యాజమాన్యాల పరిధిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా, అత్యధికంగా 94.03 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు మొదటిస్థానంలో నిలిచాయి. కాంపోజిట్ యాజమాన్యంలోని విద్యార్థుల్లో ఉత్తీర్ణత 36.71 శాతంతో అతి తక్కువగా ఉంది. మేనేజ్‌మెంట్ల వారీగా చూస్తే టీజీఎస్ఆర్టీసీ 89.29, సోషల్ వెల్ఫేర్ 86.79, సెంట్రల్ గవర్నమెంట్ 86, టీఎస్ గవర్నమెంట్ **మిగతా 2లో...**

# 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర

## కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది: కేటీఆర్ తీవ్ర విమర్శలు**

**సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్**

**తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు**

**హైదరాబాద్ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్ పార్టీగా పేరు మార్పు చేసే అంశాన్ని పరిశీలన చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ముగిసిన తరువాత కొంతమంది మీడియా సభ్యులతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు కీలకవ్యాఖ్యలు చేశారు. పార్టీ పేరు మార్పు గురించి ఆలోచన తమ పరిశీలనలో ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీ పేరు మార్చాక కొంత నష్టపోయిన మాట వాస్తవం అన్నారు. మళ్లీ పాత పార్టీ పేరు **మిగతా 2లో...**



# నేడు 51 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

**విపత్తుల నిర్వహణ సంస్థ**

**అమరావతి : ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో సోమవారం నాడు 51 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 49 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాడ్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు **మిగతా 2లో...**



# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి

## పార్టీల ఫ్లోర్‌లీడర్లకు ప్రధాని మోడీ లేఖ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
మహిళా రిజర్వేషన్ చట్టం (నారీశక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లకు ప్రధాని మోడీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని అందులో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను 33 శాతం మహిళా **మిగతా 2లో...**



# ఇరాన్, అమెరికా మధ్య చర్చలు విఫలం

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ ఆరోపించింది. యుద్ధంలో సాధించలేని వాటిని అమెరికా ప్రస్తావించిందని దుయ్యబట్టింది. శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో పశ్చిమాసియాలో ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో 21 గంటల పాటు ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య ప్రత్యక్షంగా జరిగిన సుదీర్ఘ చర్చలు విఫలమయ్యాయి.

'మేము ఒప్పందానికి రావడంలో విఫలమయ్యాం. ఇది దుర్వార్త. అమెరికాతో పోలిస్తే ఇరాన్‌కే ఇది మరింత దుర్వార్త అవుతుంది' అని అమెరికా ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత తొలిసారిగా అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చలు విఫలమైన తర్వాత స్వదేశానికి తిరుగు ప్రయాణం కావడానికి ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నిబంధనలకు ఇరాన్ అంగీకరించలేదని ఆరోపించారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని త్వరితగతిన తయారు చేసేందుకు అవసరమైన ఉపకరణాలను పొందబోమని ఇరాన్ హామీ ఇస్తుందని భావించామని, కానీ అది జరగలేదని చెప్పారు. చర్చల సందర్భంగా తాము ఎంతో సానుకూలంగా వ్యవహరించామని చెప్పుకొచ్చారు.

మంచి ఉద్దేశంతో ఇస్లామాబాద్ వచ్చామని, ఒప్పందం కోసం ఎంతగానో ప్రయత్నించామని, అయితే దురదృష్టవశాత్తూ దానిని సాధించలేకపోయామని తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోయినప్పటికీ తమ ప్రతిపాదనలపై స్పందించడానికి ఆ దేశానికి కొంత సమయం ఇస్తామని అన్నారు. సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ తమ మధ్య నెలకొన్న విభేదాలను ఇరు పక్షాలు పరిష్కరించుకోలేకపోయాయని, అందుకే ఒప్పందం కుదరలేదని చెప్పారు. తమకు అపూర్వ ఆతిథ్యమిచ్చిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక దళాల ప్రధానాధికారి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లను ఆయన ప్రశంసలతో ముంచెత్తారు. చర్చల వివరాలను దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్, ఆర్థిక మంత్రి బెస్సెంట్‌లకు ఎప్పటికప్పుడు తెలియజేశామని వివరించారు. విలేకరుల సమావేశం తర్వాత వాన్స్ బృందం స్వదేశానికి బయలుదేరింది.

**హోర్ముజ్‌లో కదులుతున్న నౌకలు**

ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కదులుతున్నాయి. లిబియా పతాకంతో సెరిఫోస్, చైనా పతాకంతో కాస్పెరల్ లేక్, హీ రంగ్ హోరు నౌకలు హర్మ్యూజ్‌ను దాటాయి. వీటిలో ప్రతి నౌకకు రెండు మిలియన్ బ్యారల్స్ చమురును రవాణా చేయగల సామర్థ్యం ఉంది. థాయిలాండ్‌కు చెందిన ఏడు చమురు నౌకలు ఇరాన్ అనుమతుల కోసం హర్మ్యూజ్‌లో నిలిచి ఉండగా వాటిలో ఒకటైన సెరిఫోన్‌కు క్లియరెన్స్ లభించింది. ఈ నౌక సౌదీ అరేబియా నుంచి యూఏఈకి చమురును తీసుకొని మార్చిలో బయలుదేరింది. సెరిఫోన్ ఈ నెల 21న మలేసియాలోని మలక్కా ఓడరేవుకు చేరుకునే అవకాశం ఉంది. కాగా ఓషన్ థండర్ అనే నౌక ఇరాక్ ముడి చమురుతో గత వారమే హోర్ముజ్‌ను దాటింది. ఇరాక్ చమురును రవాణా చేస్తున్న కాస్పరల్ లేక్ నౌక తూర్పు చైనాలోని జౌషన్ ఓడరేవుకు మే 1న చేరుకుంటుంది. సౌదీ ముడి చమురుతో హర్మ్యూజ్‌ను దాటిన హీ రంగ్ హాయ్ నౌక ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు.

# హోర్ముజ్‌ను దిగ్బంధించండి

**అమెరికా నావిక దళానికి ట్రంప్ ఆదేశాలు**

వాషింగ్టన్ **: ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

ఇరాన్‌తో చర్చలు విఫలమైన వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "హర్మ్యూజ్‌ను దిగ్బంధించాలని మా దేశ నౌకాదళాన్ని ఆదేశించాం. జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా నిష్క్రమించకుండా అమెరికా నౌకలు అడ్డుకోవడం మొదలుపెడతాయి. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడిస్తాం. చట్టవిరుద్ధమైన టోల్ చెల్లింపులు జరిపినా ఎవరికీ అంతర్జాతీయ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండదు. సరైన సమయంలో ఇరాన్‌ను అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం." అని పేర్కొన్నారు. హోర్ముజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసినా, మాటతప్పిందన్నారు. ఇరాన్ చర్యలతో అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

జలసంధిని వెంటనే తెరవాలని అన్నారు. చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ అణుశక్తి విషయంలో అంగీకారం కుదరలేదని ట్రంప్ పేర్కొన్నారు. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే చర్చలు బెడిసికొట్టాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన నాశనమైందనిడ గగనతల రక్షణ, రాడార్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. ఖమేని సహా అనేకమంది ఇరాన్ నేతలు మరణించారని, ఇదంతా వారి అణ్వాయుధాల ఆశయం వల్లేనని తెలిపారు. హర్మ్యూజ్ దిగ్బంధనం త్వరలో ప్రారంభమవుతుందని, ఇందులో ఇతర దేశాలు కూడా భాగస్వాములవుతాయని అన్నారు. చట్టవిరుద్ధంగా ఇరాన్ ప్రయోజనం పొందడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అన్నారు.

**నిర్మాణాత్మక చర్యలు సూచించినాడ. : ఘలీబఫ్**

చర్చల సమయంలో తమ విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. శాంతి చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధి బృందంలో ఆయన కూడా సభ్యుడిగా వ్యవహరించారు. 'ఇరాన్ ప్రతినిధి బృందంలోని నా సహచరులు 168 నిర్మాణాత్మక చర్యలు సూచించారు. చివరికి జరిగిందేమిటంటే ఇరాన్ ప్రతినిధి బృందం విశ్వాసాన్ని అమెరికా పొందలేక పోయింది' అని ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలిపారు. గత రెండు యుద్ధాల అనుభవాల దృష్ట్యా ఇరు పక్షాలు పరస్పర విశ్వాసాన్ని పొందలేకపోయాయని చెప్పారు. రెండు లేదా మూడు కీలక అంశాలు ఒప్పందానికి అవరోధంగా మారాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి తెలిపారు. కొన్ని అంశాలపై ఇరు పక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ ఇతర అంశాలపై అభిప్రాయబేధాలు నెలకొన్నాయని వివరించారు. 'దౌత్యం ఎన్నటికీ ముగియబోదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్క సమావేశంలోనే ఒప్పందం కుదరదు కదా అని చెప్పారు. చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్‌తోనూ, ఇతర స్నేహితులతోనూ ఇరాన్ సంప్రదింపులు కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


# ఏపీలో నవశకం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా వస్తున్న ఈ కేంద్రాలతో రాష్ట్రంలో నూతన సాంకేతిక శకానికి నాంది పడనుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు 1ఎస్, 1క్యూ పేర్లతో రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ఆవిష్కరించనున్నారు. ఈ కేంద్రాల ద్వారా క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి, సర్టిఫై చేసే అత్యంత కీలకమైన సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి లభిస్తుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మరో కేంద్రం ఏర్పాటవుతోంది.

మైనస్ 273 డిగ్రీల సెంటీగ్రేడ్ అతిశీతల ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్లు, క్వాంటం ఉపకరణాల తయారీ, పరిశోధనలలో కీలకం కానున్నాయి. ముఖ్యంగా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీని 'ఓపెన్ యాక్సెస్' పద్ధతిలో అందుబాటులో ఉంచుతారు. దీనివల్ల క్వాంటం ఉపకరణాలు తయారు చేసే కంపెనీలు, పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది.



ఈ రెండు క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలలో పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే వినియోగించడం విశేషం. మేధా టవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ '1క్యూ' పేరుతో టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేయగా, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో '1ఎస్' పేరుతో సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో మరో టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ), డీఆర్డీవో వంటి దేశంలోని అగ్రశ్రేణి సంస్థలు పూర్తి సహకారం అందించాయి. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి సుమారు 1.5 లక్షల మంది విద్యార్థులు వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది రాష్ట్ర యువతలో సాంకేతిక విద్య పట్ల ఆసక్తిని మరింత పెంచుతుందని భావిస్తున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని వివరించారు. విస్తృత సంప్రదింపుల అనంతరం నారీశక్తి వందన్ అధినియమ్ అమలుకు సమయం ఆసన్నమైందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చామని, 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, భవిష్యత్ తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని వివరించారు. ఎంపీలంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. "మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెంటులో ఎక్కువ మంది తమ అభిప్రాయాలను పంచుకోవడం అందరికీ గర్వకారణమవుతుంది.

వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపం దాల్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల మంది భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం నాకు ఉంది" అని మోడీ లేఖలో పేర్కొన్నారు. మహిళలు ఎదిగేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు, ప్రత్యేకించి నాయకత్వం వహించేందుకు ఎంతగా అవకాశమిస్తే అంత గా సమాజం ప్రగతి పథంలోకి వెళ్తుందని వివరించారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని మోడీ పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్లు లేఖలో ప్రధాని వివరించారు.

**ఆదరబాదరగా బిల్లు అమలుకు కేంద్రం యత్నం : ఖర్గే**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ)లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరబాదరగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలూ వెల్లడిం చకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశా లపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే వివరించారు. ఇందుకోసం ఈ నెల 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "నారీశక్తి వందన్ అధినయమ్ 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు.

ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున నేను స్వయంగా కోరాను" అని ఖర్గే గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమిటేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధిం చిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని పేర్కొన్నారని, అయితే అది నిజం కాదని ఖర్గే అన్నారు. మిగిలిన మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 29న ముగుస్తాయని, ఆ తర్వాత ఎప్పుడైనా సరే రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉద్దేశించినదే అయితే నారీశక్తి వందన్ అధినియమ్-2023 సవరణతో ముడిపడిన డీలిమిటేషన్‌పై చర్చ జరిపేందుకు ఈ నెల 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే సూచించారు.

**బీజేపీ మూడు లైన్ల విప్ జారీ**

ఈ నెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో తమ పార్టీ ఎంపీలకు బీజేపీ మూడు లైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా ఈ సమావేశాల సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఆ విప్‌లో కోరింది. కేంద్రమంత్రులతో సహా ఎంపీలంతా ఈ మూడు రోజులు సభలోనే ఉండాలని, ఎలాంటి సెలవులూ మంజూరు చేసేదిలేదని స్పష్టం చేసింది. హాజరు కచ్చితంగా ఉండాలని విప్ పేర్కొంది. ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై దృష్టి పెట్టడం, రిజర్వేషన్ అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని నారీశక్తి వందన్ అధినయమ్-2023 చెబుతోంది. అయితే జనగణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముందుకు వెళ్లాలని కేంద్రం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.



# మూగబోయిన గానకోకిల

**మొదటిపేజీ తరువాయి**

ఆశా భోస్లే మరణంతో ఒక శకం ముగిసిందని, ఆమె సంగీతం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు ఆనందాన్ని పంచిందని ఆయన అన్నారు.సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లోయర్ పారెల్‌లోని ఆమె నివాసంలో అభిమానులు, ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచుతారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు జరుగుతాయని షెలార్ తెలిపారు.తీవ్రమైన ఆయాసం, ఛాతీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను శనివారం సాయంత్రం ఆసుపత్రిలో చేర్పించారు. బహుళ అవయవాలు విఫలం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) కావడంతో ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. 1933లో జన్మించిన ఆశా భోస్లే, కొన్ని దశాబ్దాల పాటు తన అద్భుతమైన గానంతో భారతీయ సంగీత ప్రపంచాన్ని ఏలారు. వేల సంఖ్యలో పాటలు పాడి, శాస్త్రీయ సంగీతం నుంచి పాప్ వరకు అన్ని ప్రక్రియల్లో తనదైన ముద్ర వేశారు. ఆమె మృతి పట్ల దేశవ్యాప్తంగా సంగీత, సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటర్‌లో బాలికలదే హవా

**మొదటిపేజీ తరువాయి**

స్పోర్ట్స్ 84.85, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు 84.46, ట్రైబల్ వెల్ఫేర్ 84.20, బీసీ వెల్ఫేర్ 83.48, కేజీబీవీ 81.39, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 71.57, మోడల్ స్కూల్స్ 66.15, ఇన్సెంటివ్ 65.70, గవర్నమెంట్ 59.86, ప్రయివేట్ ఎయిడెడ్ 55.78, కో ఆపరేటివ్ కళాశాలలు 52.43 శాతాలతో ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ దాదాపు ఇదే రకమైన ఫలితాలు ఆయా యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాతో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బాయి, సీజీజీ డైరెక్టర్ జనరల్ రవి గుప్తా పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు 71.12 శాతం, వొకేషనల్‌లో 65.65 శాతం మొత్తం 70.60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 66.20 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.34 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 74.40 శాతం, బాలురు 57.69 శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 68.08 శాతం ఉత్తీర్ణత సాధిస్తే బాలికలు 82.07 శాతంతో పైచేయి సాధించారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థుల్లో మొదటి సంవత్సరం 66.91 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ ఏడాది 66.94 శాతానికి పెరిగింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలోనూ 71.43 శాతం నుంచి 75.61 శాతానికి చేరింది. వొకేషనల్ ఉత్తీర్ణతా శాతం మొదటి సంవత్సరంలో 57.69 శాతం నుంచి 59.30 శాతానికి, రెండో సంవత్సరంలో 67.45 శాతం నుంచి 71.15 శాతానికి పెరిగింది.

# 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర

**మొదటిపేజీ తరువాయి**

గురించి చర్చ జరుగుతోందన్నారు. ఇటీవల కవిత తాను పెట్టబోయే పార్టీకి టీఆర్‌ఎస్ పేరు పెడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో కేటీఆర్ పార్టీ పేరు మార్పు గురించి మీడియాతో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇంకా అనేక విషయాలను కేటీఆర్ వివరించారు.

గతంలో తాము చేసిన చిన్నచిన్న తప్పుల వల్ల పార్టీకి, ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ అన్నారు. జరిగిన తప్పులపై అధ్యయనం చేశామని, లోపాలను సరిదిద్దుకుంటామని తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీయేనని, కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌తో తెలంగాణలో 179 అసెంబ్లీ సీట్లు, 28 పార్లముంటు స్థానాలు పెరుగుతాయని, అందరికీ టికెట్లు లభిస్తాయని అన్నారు. పొత్తులకు తమకు కలిసిరాదని, కుదరదని అన్నారు. బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదన్నారు. తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీకి సిద్ధమని, ఇక్కడ పోటీ చేయాలని ఏమీ లేదన్నారు. ప్రజా సమస్యలపై 2027లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేయబోతున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలన చేశారని, వారిలో ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ అని చెప్పారు.

**దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం : కేటీఆర్**

రాష్ట్రాన్ని దోచుకొని దాచుకోవడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యంగా పనిచేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటనలో భాగంగా నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి 30 నెలలైనా ఆ గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా క్యాతన్‌పల్లిలో కాంగ్రెస్ మంత్రి నీచ కృష్ణ రాజకీయాలు చేశారని, కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేసి డబ్బు ఎరగా చూపారన్నారు. అయినా నికార్సైన కార్యకర్తలు ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరిగేలా చూడడం అభినందనీయమన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుమన్ క్యాతన్ పల్లిలో ఉంటే తమ ఆటలు సాగవని అక్రమంగా అరెస్ట్ చేసి ఆసిఫాబాద్, మంచిర్యాల సబ్ జైలు కాకుండా ఆదిలాబాద్ జిల్లా జైల్లో పెట్టారని అన్నారు. నవంబర్‌లో తీసుకుంటే రైతుబంధు పదివేలు వస్తది, డిసెంబర్‌లో తీసుకుంటే 15 వేలు వస్తదంటూ నమ్మబలికి గద్దెనెక్కారని అన్నారు. కేసీఆర్ చెప్పిన విధంగానే కాంగ్రెస్ పాలనలోకి వస్తే రైతుబంధుకు రామ్‌రామ్, రైతు బీమాకు జై హింద్ అన్నట్లుగానే పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ బాగుపడాలన్నా, రైతుల ముఖంలో చిరునవ్వులు రావాలన్నా, సింగరేణి కార్మికులకు న్యాయం జరగాలన్నా కేసీఆర్ తిరిగి రావాల్సిందేనని అన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన దోచుకో-దాచుకో' పథకం సింగరేణిలోనూ నడుస్తోందన్నారు.

# నేడు 51 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

**మొదటిపేజీ తరువాయి**

అవకాశం ఉందని ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నాడు శ్రీకాకుళం జిల్లాలో 9, విజయనగరం 18, పార్వతీపురం మన్యం 15, అల్లూరి సీతారామరాజు 1, పోలవరం 3, అనకాపల్లి 3, ఏలూరు 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 2, విజయనగరం 5, అల్లూరి సీతారామరాజు 4, పోలవరం 9, అనకాపల్లి 5, కాకినాడ 5, తూర్పుగోదావరి 9, ఏలూరు 4, ఎన్‌టిఆర్ 3, పల్నాడు 2, నంద్యాల 1 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

**మొదటిపేజీ తరువాయి**

ంగా పెరిగాయన్నారు. ఈ ఆస్పత్రిలో 2023లో 35 వేలు ఓపీ నమోదు కాగా, 2025 నాటికి 45 వేలకు చేరిందన్నారు. మేజర్ సర్జరీలు 359 నుంచి 449కు పెరిగాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, కర్నూలు, విశాఖపట్నం, కడప, గుంటూరుల్లో అత్యాధునిక క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. డయాలసిస్ మిషన్ల సంఖ్యను 550 నుంచి 725కు పెంచి కిడ్నీ బాధితులకు భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించేలా త్వరలోనే హెల్త్ స్కీమ్‌ను అమలు చేయబోతున్నామని చెప్పారు. కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులో వున్నాయని తెలిపారు.సీఎస్‌ఆర్ నిధులతో ఆస్పత్రుల్లో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్
సోమవారం 12 ఏప్రిల్ 2026

# వధూవరులను ఆశీర్వదించిన మండల కన్వీనర్ జూటూరు మారయ్య



**చిప్పగిరి, ఏప్రిల్, 12,(రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం మండల కేంద్రమైన చిప్పగిరిలో చిప్పగిరి మాజీ సర్పంచ్ సి గోవిందన్న కుటుంబ వివాహ వేడుకలకు దేగులపాడు జూటూరు మారయ్య ముఖ్య అతిథులుగ హాజరయ్యారు. దీంతో మాజీ సర్పంచ్ గోవిందన్న సోదరుడు వీఆర్వో కుటుంబ సభ్యులు మారయ్యను డప్పులు వాయిద్యాలతో బాణాసంచా పేలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించి సన్మానించారు. అనంతరం వైసిపి మండల కన్వీన ర్ జూటూరు మారయ్య నూతన వధూవరులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, లాల్ స్వామి, తో పాటు తదితరులు పాల్గొన్నారు

# ఏరూరు లో ఘనంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం



**చిప్పగిరి, ఏప్రిల్, 12,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం ఏరూరు గ్రామంలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా రథోత్సవం జరిగింది, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు ఆహ్వానం మేరకు వైకుంఠం దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, వైకుంఠం దంపతులకు గజ మాలతో , బాణాసంచ ,డప్పు లతో ఘనంగా సత్కరించారు, వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ రథోత్సవంలో పాల్గొన్నారు, వైకుంఠం దంపతులు రామలింగేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మహేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు పలకరించారు, సొసైటీ సి ఓ హరికృష్ణ కుటుంబ సభ్యులను పలకరించారు, గ్రామంలో ముఖ్య నాయకులు కుటుంబ సభ్యుల్ని పలకరించారు, ఈ కార్యక్రమంలో సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, జోహారాపురం లక్ష్మీ ప్రసన్న, నేమకల్ సన్నప్ప, చిప్పగిరి మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, జయన్న, జనార్దన్ స్వామి, కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# చెరువు మరమ్మతుకు రూ.9.5 లక్షలు మంజూరు

మరమ్మతు పనులు మరో నెలలోగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

హంద్రీనీవా ద్వారా చెరువుకు నీరు అందించేలా ప్రణాళికలు



**అనంతపురం సంక్షేమం, ఏప్రిల్ 12, ( రిపబ్లిక్ న్యూస్ ):**
కనగానపల్లి మండల కేంద్రంలోని రెడ్డి వారి కుంట చెరువు మరమత్తు పనులు నెలలోగా పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆదివారం ఆమె చెరువు మరమ్మతుపనులను అధికారులతో కలిసి పరిశీలించారు. 2024లో అక్టోబర్ 21న కురిసిన అతి భారీ వర్షాలకు ఈ చెరువు తెగిపోగా.. చెరువు మరమ్మతులకు డీఎంఎఫ్ గ్రాంట్ రూ. 86 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పనులను మార్చి 17న ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చెరువు మరమ్మతు పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వివరించారు. మిగిలిన పనులు కూడా నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పనులు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. కట్ట నిర్మాణం, రివిటింగ్ లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తూముల రిపేరీ కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

**హంద్రీనీవా నుంచి చెరువుకు నీరు అందించేలా ప్రతిపాదనలు సిద్ధం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో వర్షాలు వచ్చినప్పుడు చెరువు తెగిపోయి చాలా నష్టం వాటిల్లిందని.. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు హంద్రీనీవా కాలువ నుంచి చెరువుకు నీరు అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రూ. 9. 5 లక్షలతో ఈ పనులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఆ పనులు కూడా పూర్తి చేస్తే చెరువుకు నీరు ప్రతి ఏటా అందుతుందన్నారు.

# రెవెన్యూ నిర్లక్ష్యం


## రైతులకు అందని పరిహారం






**చిప్పగిరి, ఏప్రిల్,12,(రిపబ్లిక్ న్యూస్)**
రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైల్వేరిజర్వాయర్ భూనిర్వహిత రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని రైతులు శ్రీనివాస్ చౌదరి ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడుతూ చిప్పగిరి రెవెన్యూ పరిధిలోని దాదాపు 6మంది రైతుల కు సంబంధించిన భూములను రైల్వే రిజర్వాయర్ కు తీసుకున్నారు .కానీ 10 సంవత్సరాలైనా ఇంతవరకు రైతులకు డబ్బులు చెల్లించలేదని రైతులు శ్రీనివాస్ చౌదరి, గోపిక్రిష్ణ, ప్రసాద్, సుబ్బమ్మ, గీత, మనీ, గుంతకల్లు డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లివాపోయారు. చిప్పగిరి రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 726, 713, 727, 728, 730 సర్వే నెంబర్లలో విస్తీర్ణం 39 ఎకరాల 42 సెంట్లు రైతుల భూమి రైల్వే రిజర్వాయర్కు 10 సంవత్సరాల కిందట తీసుకొని ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని తమ పరిస్థితి ఏమిటి, రైల్వే అధికారులకు పట్టదా అని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు రైతులకు భూమికి సంబంధించిన డబ్బులు చెల్లించడంలో అలసత్వం వహించడంతో రిజర్వాయర్ రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా రెండు సంవత్సరాల కిందట సుప్రీంకోర్టు రైతుల సమస్యను తీర్చాలని వారికి వెంటనే పరిహారం చెల్లించాలని ఆదేశాలను రైల్వే, రెవెన్యూ,, అధికారులకు ఉత్తర్వులను జారీ చేసింది. రైల్వే అధికారులు ఇంతవరకు రైతులకు డబ్బులు చెల్లించకుండా రైతుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని రైతులు రైల్వే గుంతకల్ డిఆర్ఎం తోఆరోపిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించని రైల్వే రెవెన్యూ అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తూ రైతులతో వారి ప్రాణాలతో చలగాటమాడుతున్నారని వాపోయారు. మా పొలాలు మేము తీసుకొని సాగు చేసుకుంటాం అంటూ వాపోతూ ఆందోళన వ్యక్తం చేశారు. పొలాలకు సంబంధించి డబ్బులు రైల్వే అధికారుల నుండి రెవెన్యూ రాగానే వెంటనే రైతుల అకౌంట్లో జమ చేస్తామని తాసిల్దార్ రైతులను బుజ్జగించారు. దీంతో రైతులు గోడును వ్యక్తం చేస్తూ, మా పొలాలు మేము తీసుకొని సాగు చేసుకుంటాం, లేకపోతే మాకు న్యాయం చేయండి, న్యాయం చేయకపోతే ఎలా అంటూ ఆరోపించారు. అనంతరం రైతు శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ రైల్వే రెవెన్యూ అధికారులు 10 సంవత్సరాల నుండి రైల్వే రిజర్వాయర్కు తమ పొలాలను తీసుకొని డబ్బులు చెల్లించకుండా రైతుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని రైల్వే రెవెన్యూ అధికారులకు ఇది సమంజసం కాదని వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ నుండి ఎంత డబ్బు చెల్లించాలని లెటర్ రూపకంగా రైల్వే కు వచ్చిన పది రోజులలో రైల్వే రిజర్వాయర్ రైతులకు డబ్బులు చెల్లిస్తామని రైల్వే డి ఆర్ ఎం పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తమకు సంవత్సరాలనుండి డబ్బులు రాక పరిహారం అందక ఇబ్బందులకు గురవుతున్నట్లు రైతుల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు కు రెవెన్యూ అధికారులు లెటర్ పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తిరిగి సుప్రీంకోర్టులో రిట్ వేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకల్లో ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి







**చిప్పగిరి, ఏప్రిల్, 12,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరిలో మాజీ సర్పంచ్ గోవిందన్న తమ్ముడు విఆర్ఓ గోవింద కుమారుడు పెళ్లి వేడుకల్లో ఆదివారం ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, గోవింద్ అన్న కుటుంబ సభ్యులు వైకుంఠం జ్యోతి ని డప్పులతో, బాణాసంచా కాలుస్తూ పూలమాలలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు, నూతన వధూ వరులను సురేంద్ర, సునీత,లను వైకుంఠం జ్యోతి ఆశీర్వదించారు, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు, అనంతరం మాజీ సర్పంచ్ గోవిందన్న కుటుంబ సభ్యులతో ముచ్చటించారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ పురుషోత్తం, మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, నేమకల్ సన్నప్ప, జనార్దన్ స్వామి, బోగేస్ స్వామి,దేవరగట్టు ఆలయ కమిటీ డైరెక్టర్ దేవక్క గారి జయన్న, సంఘాల భాస్కర్, నంచర్ల తిమ్మప్ప, బిజెపి మండల కన్వీనర్ గోపాల్, బిల్లోన కోనంకి శ్రీనివాసులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ చొరవతోనే బోయకొండ గంగమ్మ దేవస్థానం వార్షిక ఆదాయం పెరుగుదల

**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 12 రిపబ్లిక్ న్యూస్**
కూటమి ప్రభుత్వ చొరవతోనే శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ వార్షిక ఆదాయం పెరిగినట్లుగా స్థానికులు అంటున్నారు ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయ పరిపాలన భవనంలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం వార్షిక ఆదాయ ఆలయ అభివృద్ధిపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశారు ఈ వార్షిక ఆదాయం సంవత్సర కాలంలో రూ 12 కోట్ల నుంచి 16 కోట్లు ఆదాయంగా సమకూరినట్లు ఆయన వివరించారు బోయకొండ దేవస్థానంలో వివిధ వనరుల ద్వారా అత్యధిక సంఖ్యలో ఆలయం పెరగడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భక్తులు ఆకర్షితులై కూటమి ప్రభుత్వం బోయకొండ దేవస్థానం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లుగా దీనిని బట్టి అర్థమవుతుంది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డీసీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ బాబులు రాష్ట్రంలోనే శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే దినదినాభివృద్ధి చెందుతున్నట్లుగా స్థానికులు అభివర్ణిస్తున్నారు దేవస్థానం వార్షిక ఆదాయం పెరుగుదలకు కూటమి ప్రభుత్వం చేపట్టిన విధానాలు వాటిని చేరవేయడంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం మండల నాయకత్వం చేసిన కృషి వర్ణనాతీతమని ఈవో ఉపకరించిన ఏకాంబరం చెప్పారు బోయకొండ సమీపంలోని భవాని నగర్ గంగాపురం ఆలయం కొండ కింద నుంచి మెట్ల మార్గం



పుష్కరిణి పెద్ద భోగం చిన్న భోగం అమ్మవారి సన్నిధానంలోని క్యూలైన్ల ఆధునీకరణ యాత్రికుల వాహనాల కోసం పార్కింగ్ స్థలం వీటన్నింటిని మించి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు స్థల సేకరణ వంటివి సంవత్సర కాలంలోనే జరిగాయి సంవత్సర కాలంలో బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ 5.33 కోట్ల రూపాయలు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు ఈ విధంగా ఆదాయం పెరగడానికి అధికారులు తెలుగుదేశం పార్టీ మండల నాయకత్వం కృషి ఉందని తెలుస్తోంది కూటమి ప్రభుత్వ హయాంలోనే బోయకొండ గంగమ్మ దేవస్థానం నైసర్గిక స్వరూపం మారిందని ఇదేవిధంగా యాత్రికుల సంఖ్య పెరిగిందని పలువురు అంటున్నారు బోయకొండ దేవస్థానంలో జరుగుతున్న ప్రతి కార్యక్రమంలోనూ కూటమి ప్రభుత్వ మండల నాయకత్వం చొరవచూపి ఎలాంటి అవినీతి అక్రమాలకు చోటు లేకుండా చేయడం వలన దేవస్థానానికి వార్షిక ఆదాయం అధిక సంఖ్యలో నిధులు సమకూర్చినట్లుగా తెలుస్తోంది దేవస్థానంలో అభివృద్ధి ప్రక్షాళన చేయడంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకత్వం సఫలీకృతం అయినందునే బోయకొండ దినదిన అభివృద్ధి జరుగుతుందని పలువురు అంటున్నారు.కొండ కింద యాత్రికుల వసతి గృహాలు మౌలిక వసతుల కల్పన వంటివి స్వీయ పర్యవేక్షణలో జరుగుతుండడం విశేషం ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల రానున్న కాలంలో బోయకొండ మరిన్ని అభివృద్ధి జరుగుతుందని యాత్రికులు అంటున్నారు. వార్షిక ఆదాయం పెరిగినందుకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి దేవస్థానం అధికార వర్గానికి సహకరిస్తున్న స్థానికులను అభినందించారు.

# కేఎంసీలో జనరల్ మెడిసిన్ జోనల్ సీఎంఇ విజయవంతం

## మెడిసిన్ విభాగంలో తాజా వైద్య అప్డేట్స్‌పై నిపుణుల విస్తృత చర్చ










**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 12)**
కర్నూల్ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జోనల్ స్థాయి కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఇ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఏడీఎంఈ డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు.
ఈ సీఎంఇలో కర్నూలు, నంద్యాల, అనంతపూర్ జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల జనరల్ మెడిసిన్ పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులో సాధారణ రోగాలు, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్, క్యాన్సర్ చికిత్స తదితర అంశాలపై నిపుణులు సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ అబ్జర్వర్ మరియు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ మరియు జోనల్ సీఎంఇ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, విశ్వ భారతి హాస్పిటల్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రవి కళాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
అలాగే డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ మోహన్ రెడ్డి, డాక్టర్ సాయి సంపత్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్ వంటి నిపుణులు హాజరై ముఖ్య ఆరోగ్య సమస్యల చికిత్సలపై తాజా మార్గదర్శకాలను విద్యార్థులకు వివరించారు.
ఈ సదస్సు ద్వారా వైద్య విద్యార్థులు ఆధునిక వైద్య విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

## వివాహ శుభకార్యాలకు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాటసాని దంపతులు







**ఓర్వకల్లు ప్రతినిధి, ఏప్రిల్ 12(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల జిల్లా బనగానపల్లె లో ఉన్న దీమా= కన్వెన్షన్ హాల్ నందు అవుకు మండలం, రాఘవరాజపురం (పెద్ద కొట్టాల) గ్రామానికి చెందిన మునగల భాస్కర్ రెడ్డి ,కుమారుడు శ్రీకాంత్ రెడ్డి – బాలభారతి ల వివాహానికి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాటసాని దంపతులు వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అనంతరం ఓర్వకల్లు మండలం : శ్రీశ్రీశ్రీ కొమ్మ చెరువు ఆంజనేయ స్వామి దేవస్థానం నందు గుడుంబై తాండ గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు మద్దిలేటి నాయక్ సోదరుడు రమణ నాయక్ – ఆదిలక్ష్మి ల వివాహానికి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన కాటసాని దంపతులు వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి ఆయన సతీమణి శ్రీమతి కాటసాని ఉమామహేశ్వరమ్మ

## ప్రవేశ పరీక్షకు 99 మంది విద్యార్థులు హాజరు

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):-** స్థానిక మోడల్ స్కూల్లో అరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు విద్యశాఖ అధికారులు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆదివారం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సయ్యద్ అబ్దుర్ రాఫీ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష జరిగింది. ఆరవ తరగతిలో చేరేందుకు 114 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారనీ ప్రిన్సిపల్ తెలిపారు. కానీ ప్రవేశ పరీక్షకు 99 మంది విద్యార్థులు హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. పరీక్ష ఫలితాల ఆధారంగా అర్హత సాధించిన విద్యార్థులకు సీట్లు కేటాయింపు జరుగుతుందని ఆయన వెల్లడించారు.

## శ్రీవారి భక్తులకు గమనిక...
## జులై నెల టికెట్ల షెడ్యూల్ విడుదల



తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. 2026 జులై నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటా విడుదల తేదీలను అధికారికంగా ప్రకటించింది. భక్తులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకునేందుకు వీలుగా, ఏప్రిల్ 18 నుంచి దశలవారీగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.
ఏప్రిల్ 18: ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భక్తులు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.
ఏప్రిల్ 21: ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను భక్తులు నేరుగా బుక్ చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు.
ఏప్రిల్ 23: ఈ రోజు మూడు వేర్వేరు సమయాల్లో టోకెన్లు విడుదలవుతాయి.
ఉదయం 10 గంటలకు: అంగప్రదక్షిణ టోకెన్లు.
ఉదయం 11 గంటలకు: శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు.
మధ్యాహ్నం 3 గంటలకు: వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లు.
ఏప్రిల్ 24: భక్తులు అత్యధికంగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు.
భక్తులు తమకు కావాల్సిన సేవలు, దర్శన టికెట్లు, గదులను కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ అయిన ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరాలను టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## డాక్టర్ మనోహర్ నాయుడు భువనేశ్వరి దేవి వారి కుమారుడు
# వివాహానికి హాజరైన మాజీ మంత్రి బుగ్గన





**బేతంచర్ల ప్రతినిధి, ఏప్రిల్ 12,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బేతంచెర్ల పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు డాక్టర్ మనోహర్ నాయుడు & భువనేశ్వరి దేవి కుమారుడు,జగదీశ్వర్ నాయుడు & స్నేహలత,వీరి వివాహం బేతంచెర్ల పట్టణంలోని సంజీవ నగర్ కాలనీలోని మురళీధర్ రెడ్డి కళ్యాణ మండపం లో జరిగినది. ఈ వివాహానికి హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రి బుగ్గనతోపాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తు జావలి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ మునేశ్వర రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మర్రికుంట మర్రికుంట మురళీధర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసీపీ నాయకులు ప్లాట్ల దస్తగిరి, ఎర్రగుంట్ల రాజు, మాజీ వార్డ్ మెంబర్ వనము చంద్రుడు, తలారి రామనాయుడు, వలి భాష, తిమ్మరాజు, నక్క శ్రీనివాసులు, గుండాల రమణ, సంజీవరామ్, శ్రీనాథ్, వంజా వెంకట రాముడు తదితరులు వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు

# ఐపీఎల్ బెట్టింగ్, జూదంపై కఠిన చర్యలు

**కర్నూలు ఎస్పీ ఆదేశాలు**
**యువతను తప్పుదారి పట్టిస్తున్న అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు**
**- సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 12)**
జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్, మట్కా జూద కార్యకలాపాలపై రాజీపడని కఠిన చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణపై సమీక్ష నిర్వహించిన ఎస్పీ ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో జూద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి, క్రికెట్ బెట్టింగ్, మట్కా కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్‌లను ఆధారంగా చేసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న బెట్టింగ్ యువతను తప్పుదారి పట్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని, బెట్టింగ్‌లో చిక్కుకున్న వారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.
ఇలాంటి చర్యలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా సమాజంలో నేరాల పెరుగుదలకు కారణమవుతున్నాయని తెలిపారు. అందువల్ల ఎటువంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.
అలాగే ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించిన ఎస్పీ, ప్రజలు కూడా ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా బెట్టింగ్, జూదం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కర్నూలు కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9121101100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చిన ఎస్పీ, జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు ఇటువంటి అక్రమ కార్యకలాపాలను నిర్మూలించడం అత్యవసరమని పేర్కొన్నారు.

# ఐపీఎల్ వేళ బెట్టింగ్‌పై పోలీసుల గట్టి నిఘా

### జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్



**రిపబ్లిక్ క్రైమ్,ఏప్రిల్ 12, అనంతపురం**
ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ క్రికెట్ బెట్టింగ్‌లపై హెచ్చరికలు జారీ చేశారు. ఐపీఎల్‌ను ఆసరాగా తీసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపాల్లో విస్తరించకుండా బెట్టింగ్ ముఠాలను పూర్తిగా అణచివేయడానికి జిల్లా పోలీస్ శాఖ సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. సులభంగా డబ్బు వస్తుందనే మాయలో పడితే అది కేవలం నష్టం మాత్రమే కాదు, వ్యక్తిగత జీవితం, కుటుంబ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాలన్నీ ప్రమాదంలో పడతాయని స్పష్టం చేశారు. బెట్టింగ్ వ్యసనం అప్పులు, బెదిరింపులు, మానసిక ఒత్తిడి, నేర సంబంధాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

**హైటెక్ నిఘా - బెట్టింగ్ మాఫియాకు చెక్**

జిల్లాలో అక్రమ క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, డార్క్ వెబ్ కార్యకలాపాలపై సైబర్ బృందాలు నిరంతర నిఘా నిర్వహిస్తున్నారు. బాల్-టు-బాల్ బెట్టింగ్ జరిగే ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రాన్సాక్షన్ ప్యాటర్న్‌లను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తిస్తున్నారు.
ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫార్మ్‌లలో బెట్టింగ్ ప్రచారాలను ట్రాక్ చేసి చర్యలు తీసుకోనున్నారు. అనుమానాస్పద ప్రదేశాలు, హాట్‌స్పాట్‌లలో సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణతో పాటు గ్రౌండ్ లెవెల్ ఇన్‌ఫార్మేషన్ సేకరించనున్నారు.

**క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు**

క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్నా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఆంధ్రప్రదేశ్ జూద చట్టం ప్రకారం... క్రిమినల్ కేసులు నమోదు, అరెస్టులు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్, బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్, డిజిటల్ పరికరాల స్వాధీనంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని, ఎవరైనా అక్రమంగా బెట్టింగ్ నిర్వహించినా ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.
తల్లిదండ్రులు తమ పిల్లలపై కచ్చితమైన పర్యవేక్షణ ఉంచాలని, యువత తమ భవిష్యత్తును కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు.

**ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి**
మీ పరిసరాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు గమనించినా, ఆన్‌లైన్ ద్వారా జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## “జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి“
### అని విజయమ్మ నాడే చెప్పారు: మంత్రి నిమ్మల



వైసీపీ అధినేత జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని, ఆయన ‘గొడ్డలి రాజకీయం‘ రాష్ట్రానికి పెను ప్రమాదంగా పరిణమించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “నరుకుతాం, చంపేస్తాం“ అనే నీచమైన భాషతో రాజకీయాలు చేస్తూ, విధ్వంసాన్నే తమ అజెండాగా వైసీపీ మార్చుకుందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రకటిస్తున్నారని అన్నారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి కానీ, వైసీపీ మాత్రం తాము అధికారంలోకి వస్తే ఉన్నవి పడగొడతామని, పనులు ఆపేస్తామని, యువతను చెడగొడతామని చెబుతోందని నిమ్మల ఎద్దేవా చేశారు. వైసీపీ ‘యూత్ పాలసీ‘ అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త మాదక ద్రవ్యాలు తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయడమేనా? అని ప్రశ్నించారు.
“గుంటూరు ఇవతల లాగి కొడతాం, అవతల నరుకుతాం“ అని బాహాటంగా హెచ్చరిస్తూ, తల్లులకు పుత్రశోకం మిగిల్చడానికే వైసీపీ నేతలు అధికార దాహంతో ఉన్నారని ఆరోపించారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీలపై చల్లుతూ రాక్షసానందం పొందేవారు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు.
వాస్తవాలు రాస్తున్న మీడియా సంస్థల నాలుకలు కోస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమేనని అన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మరింత ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: 2023/87888



# అసంతృప్తివాదులపై పిసిసి చీఫ్ 'ఆరా'

## జిల్లా పర్యటనలతో బిజీ-బిజీ ఇప్పటికే పది జిల్లాల్లో పూర్తి



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలో పదవులు రాలేదనో, మరే ఇతర కారణాలతోనైనా నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరైనా అసంతృప్తిగా ఉన్నారా? అనే కోణంలోనూ పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ 'ఆరా' తీస్తున్నారు. మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌కు గుడ్-బై చెప్పడం పట్ల పార్టీలో కలకలం సృష్టించినందున భవిష్యత్తులో అటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తన భుజస్కందాలపైనే ఉందని ఆయన భావిస్తున్నారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు గత నెలలో మహేష్ కుమార్ గౌడ్ జిల్లా పర్యటనలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన పది జిల్లాల్లో పర్యటనలు పూర్తి చేశారు. రాబోయే రోజుల్లో మిగతా జిల్లాల్లోనూ పర్యటించనున్నారు. ఇదిలాఉండగా జిల్లా పర్యటనల సందర్భంగా ఎక్కడైనా అసంతృప్తి గళం వినిపిస్తే వారిని ముందుగానే నచ్చజెప్పే అంశాన్ని జిల్లా కార్యవర్గాలకు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సూచన చేయాలని ఆయన చెబుతున్నారు.


# మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరిక



**హైదరాబాద్:** మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు జాగ్రత్త అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అని పార్టీలను హెచ్చరించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్ లో బిల్లుకు మద్దతివ్వాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. మహిళలకు చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నది దశాబ్ద కాలంగా ప్రభుత్వ ఆలోచన అని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లుతో రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయంగా ఉండిపోతుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలూ ఈ బిల్లుకు మద్దతునివ్వాలని ఆయన కోరారు. మహిళలు ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక మహిళా రిజర్వేషన్ బిల్లు అని ఆయన తెలిపారు. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందేనని ఆయన తెలిపారు. డీలిమిటేషన్‌తో పార్లమెంట్‌లో స్థానాలు పెరుగుతాయని, తెలంగాణ అసెంబ్లీలో 60 మంది మహిళలకు అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ వివరించారు.

# హైదరాబాద్‌లో కపిల్ దేవ్‌తో గంటా శ్రీనివాసరావు భేటీ..



భారత జట్టుకు తొలిసారి ప్రపంచకప్ అందించిన క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్‌తో టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో గంటా శ్రీనివాసరావు.. కపిల్ దేవ్‌ను విశాఖపట్నం రావాల్సిందిగా ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే తాను విశాఖ వస్తానని కపిల్ హామీ ఇచ్చినట్టు గంటా వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ విందు సమావేశంలో ప్రముఖ దర్శకుడు శివ కొరటాల, ఇతర మిత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 43 ఏళ్ల నాటి క్రికెట్‌తో పాటు, ప్రస్తుత తరం ఆట గురించి సుదీర్ఘంగా చర్చించుకున్నామని గంటా తెలిపారు. కపిల్ దేవ్ తన క్రికెట్ జీవితంలోని మధుర స్మృతులను పంచుకున్నారని పేర్కొన్నారు. ఈ భేటీలో రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి గురించి కపిల్ దేవ్‌కు వివరించినట్టు గంటా శ్రీనివాసరావు తన ప్రకటనలో తెలిపారు. విశాఖ నగరం తనకు కూడా ఎంతో ఇష్టమని కపిల్ దేవ్ చెప్పారని గంటా వివరించారు. బీచ్ సిటీ పర్యటన కోసం ఎదురుచూస్తున్నానని, త్వరలోనే అక్కడి గోల్ఫ్ కోర్స్‌ను సందర్శిస్తానని కపిల్ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ చేరుకున్న లోకేశ్

## నేడు కూటమి ఎంపీలతో కలిసి రాష్ట్రపతితో భేటీ

### రాజధాని బిల్లు ఆమోదంపై ధన్యవాదాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సోమవారం భేటీ కానున్నారు. ఆయన ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రమంలో ఆయనకు టీడీపీ ఎంపీలు సాదర స్వాగతం పలికారు. లోకేశ్ వారందరినీ ఆప్యాయంగా పలకరించి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై క్లుప్తంగా చర్చించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంపై సోమవారం కూటమి ఎంపీలతో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లి ఆమెకు కృతజ్ఞతలు తెలుపనున్నారు.

# కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహణ

**సరైన ధ్రువపత్రాలు లేని 10 మోటార్ సైకిల్ లకు జరిమాన**

**నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు**

**గంజాయి ఇతర మత్తుపదార్థాల నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన**

**ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్**



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):** శాంతిభద్రతల పరిరక్షణ నేరం నియంత్రణలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో నందికొట్కూరు, వెలుగోడు పోలీస్ స్టేషన్ ల పరిధిలలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది.

**కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ వివరాలు**

ఆత్మకూరు రూరల్ సర్కిల్ వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంతకందాల గ్రామం నందు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ సహకారంతో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమాన విధించడంతో పాటు అక్రమ మద్యం 20 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నందికొట్కూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షికారి పేట నందు ఆపరేషన్ వజ్రపహారి కార్యక్రమంలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు రికార్డులు లేని జరిమానా విధించడంతో పాటు షీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇల్లులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది.

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరిక**

రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టం, చైల్డ్ మ్యారేజెస్, మాదకద్రవ్యాలు వాటి వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, శక్తి యాప్ వల్ల ప్రయోజనాలు టోల్ ఫ్రీ నంబర్ లపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి, అనుమానితుల గురించి, ప్రజలు డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

# పొలాలకు చుక్క నీరు అయినా ఇచ్చారా

## ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది -జగనన్న హయాంలో రాప్తాడు రామరాజ్యంలో ఉండేది

### సునీతమ్మ రాప్తాడుకు కరువు కానుకగా ఇచ్చింది





**అనంతపురం (రాప్తాడు), ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ఆత్మకూరు మండలం వడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్, వార్డ్ మెంబర్లు పదవి విరమణ సన్మాన సమావేశంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అదికారంలో ఉన్నన్ని రోజులు నియోజకవరంలోని ప్రజలకు రైతులకు చుక్క నీరు ఇచ్చిన దాఖలాలే లేవని వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో రాప్తాడు నియోజకవర్గం రామరాజ్యంలా ఉండేదని, ప్రస్తుతం పరిటాల కుటుంబ అరచకాలతో నియోజకవర్గంలో రాక్షస పాలన జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని వడ్డుపల్లి గ్రామంలోని సర్పంచ్ లక్ష్మినారాయణరెడ్డి పాలకవర్గ పదవీ విరమణ కార్యక్రమంలో భాగంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు,అనంతపురం రూరల్ మండలాలకు సంభందించి నీటి సమస్య ఉందని తెలియజేయడంతో జగనన్న ఇచ్చిన జీఓతో పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రత్యేక పైపైన్ పనులు ప్రారంభించామన్నారు. అయితే వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు.

**డ్యాంకు 65 కిలో మీటర్లు కాలువ తవ్వి నీరు ఇచ్చాం**

సునీతమ్మ నియోజకవర్గానికి కరువును కానుకగా ఇచ్చిందన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ని కలసి పేరూరు డ్యాంకు నీరు ఇవ్వాలని ప్రత్యేక జీఓ ఇస్తే మూడేళ్ల పాటు దశాబ్దాల కాలంగా ఎండిపోయి చుక్క నీరు లేని పేరూరు డ్యాంకు 65 కిలో మీటర్లు కాలువ తవ్వి మూడేళ్ల పాటు నీరు ఇచ్చి రైతుల కళ్లలో ఆనందం నింపామన్నారు. నియోజకవర్గంలో 3 వేల ఉచిత బోర్లు వేసి రైతులకు అండగా నిలిచామన్నారు. కాని సునీతమ్మ మాత్రం మేము పాపంపేటకు నీరు ఇవ్వాలని చేస్తే సునీతమ్మ మాత్రం ఏకంగా ఇళ్లనే కూల్చేయించారన్నారు. శాంత్రిభద్రల మేము కాపాడితే ఇప్పుడు టీడీపీ నేతలు హత్యలు, మానభంగాలు చేస్తూ నియోజకవర్గాన్ని రాక్షసకాండ సృష్టిస్తున్నారని తెలిపారు..చుక్క నీరు ఇవ్వలేదు.. రైతులకు కన్నీల్లే మిగిల్చింది సునీతమ్మ తాము అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా పేరూరు డ్యాంకు చుక్క నీరు ఇవ్వలేదన్నారు. కాగా హంద్రీ నీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి నీటిని కుప్పానికి తరలించి రైతులకు కన్నీళ్లను మిగిల్చింది.

**ప్రస్తుతం 400 అడుగులు వేసినా నీరు పడలేదు**

గతంలో వంద అడుగులు బోరు వేస్తే నీరు పడేవని ప్రస్తుతం 400 అడుగులు వేసినా నీరు పడలేదని తెలిపారు. తాము అధికారులతో మాట్లాడామని ఎందుకు నీరు ఇవ్వలేదని ప్రశ్నిస్తే నీరు ఇవ్వమని తమనిఎవ్వరు అడగలేదని అధికారులు తెలియజేశారని ప్రకాష్రెడ్డి చెప్పారు. 2018 లో లిఫ్ట్ ఇరిగేషన్ కు భూమి పూజ చేసిన సునీతమ్మ ఆ పనులు ఆపకుండా ఒక వైపు పేరూరు డ్యాంకు నీరు ఇస్తూనే మరో వైపు ఈ పనులు చేయించి దాదాపు రూ.170 కోట్లు పనులు బిల్లులు కూడా చేయించామన్నారు. ఒక్క పని చేయించకుండా సునీతమ్మ మాత్రం పేరూరు డ్యాంకు పరిటాల రవి పేరూరు పెట్టుకొవడం సిగ్గుచేటన్నారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని చంద్రబాబు చెప్పిన హామీలు ప్రజలు ఇక నమ్మే పరిస్థితుల్లో లేవన్నారు. దాదాపు వెయ్యి కోట్ల కమీషను రైతుల కడుపులు కొట్టారని తెలిపారు..

# లాయర్ హరిప్రసాద్ హత్య కేసును ఛేదించిన పల్నాడు పోలీసులు... నిందితుల అరెస్ట్



పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించిన యువ న్యాయవాది శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడింది మరెవరో కాదు, మృతుడి తోడల్లుడు, నరసరావుపేటలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట కోటయ్య అని తేల్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు నిర్ధారించి, అతడిని, మరో నిందితుడిని అరెస్టు చేశారు. రక్షించాల్సిన పోలీసు సిబ్బందే ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా తేలడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

వివరాల్లోకి వెళితే, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీరామ హరిప్రసాద్ (37) ఒంగోలులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం (ఏప్రిల్ 10) తెల్లవారుజామున చిలకలూరిపేట మండలం యడవల్లి సమీపంలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఆయన స్కూటీ మృతదేహంపై పడి ఉండటంతో, తొలుత ఇది రోడ్డు ప్రమాదంగా అందరూ భావించారు. అయితే, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు అనుమానాలు తలెత్తాయి. మృతుడి తల వెనుక భాగంలో బలమైన గాయం ఉండటంతో ఇది ప్రమాదం కాదని, హత్యేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. లోతుగా దర్యాప్తు చేపట్టగా, హత్యకు ముందు నిందితులు మద్యం కొనుగోలు చేసినప్పుడు జరిపిన ఒక ఫోన్‌పే లావాదేవీ కీలక ఆధారంగా మారింది. ఈ ట్రాన్సాక్షన్ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు.

మృతుడు హరిప్రసాద్ భార్య, నిందితుడు కానిస్టేబుల్ వెంకట కోటయ్య భార్య అక్కాచెల్లెళ్ల కూతుళ్లు. హరిప్రసాద్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని నాగజ్యోతి తన సోదరి భర్త వెంకట కోటయ్యతో చెప్పుకుని బాధపడేది. తన మరదలి కష్టాలు చూడలేక, హరిప్రసాద్‌ను అడ్డు తొలగించాలని కానిస్టేబుల్ కోటయ్య నిర్ణయించుకున్నాడు.

ఇందుకోసం తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి పక్కా ప్రణాళిక రచించాడు. గురువారం రాత్రి 'పార్టీ చేసుకుందాం రా' అని నమ్మించి హరిప్రసాద్‌ను నరసరావుపేటకు పిలిపించారు. కోటప్పకొండ రోడ్డులోని ఓ హోటల్‌లో ముగ్గురూ కలిసి అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. హరిప్రసాద్‌కు పూర్తిగా మత్తు ఎక్కాక, యడవల్లి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బండరాయితో తలపై బలంగా మోది దారుణంగా హత్య చేశారు. అనంతరం దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని పడేశారు. అయితే పోలీసుల దర్యాప్తుతో అసలు నిజం బయటపడింది. పోలీసులు కానిస్టేబుల్ వెంకట కోటయ్య, అతని స్నేహితుడు శ్రీనివాసరావును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# పేద ప్రజలకు బిగ్ రిలీఫ్.. ప్రభుత్వ ఆస్పత్రులలో శిశువుల కోసం ఫోటోథెరపీ యూనిట్లు..



**అనకాపల్లి** :ప్రభుత్వ ఆస్పత్రులలో శిశువులను మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఏపీ ప్రభు త్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగ ంగా కామెర్లు సోకిన శిశువుల కోసం ప్రభుత్వ ఆస్పత్రులలో ఫోటోథెరపీ యూనిట్లు అందు బాటులోకి తెస్తోంది. ఈ క్రమంలోనే అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ప్రభుత్వ ఆస్ప త్రిలో ఆరు ఫోటోథెరపీ యూనిట్లు ఏర్పాటు చేశారు. దీంతో శిశువులకు ఫోటోథెరపీ చికి త్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకోవాల్సిన అవసరం లేదని.. ఎల మంచిలి వాసులు హర్షం వ్యక్తం చేస్తునా ్నరురాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాల మెరుగుదలకు ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం చర్యలు తీసుకుంటోంది. మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన ద్వారా.. పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వ ఆస్పత్రులలో శిశువులు, చిన్నారులకు మెరుగైన వైద్యం అందించటంపై ఏపీ ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధారణంగా ప్రసవం అనంతరం శిశువులకు కామెర్లు సోకటం ఈ మధ్యకాలంలో సర్వసాధారణంగా మారిపోయింది. మరీ ముఖ్యంగా సిజేరియన్ ద్వారా కాన్పు చేసిన క్రమంలో పిల్లలు పుట్టిన ఒక రోజు తర్వాత వారికి కామెర్లు సోకు తుం టాయి. వీరికి మందులు, ఔషధాల బదులుగా వైద్యులు ఫోటోథెరపీ చేస్తుంటారు. ఫోటోథెరపీ చికిత్స ద్వారా కామెర్లు తగ్గుతాయి.అయితే ప్రభుత్వ ఆస్పత్రులలో ఫోటోథెరపీ యూనిట్లు అందుబాటులో లేని పరిస్థితులలో శిశువుల కుటుంబాలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుంటాయి. అయితే ఫోటోథెరపీకి కోసం గంటల చొప్పున భారీగా వసూలు చేస్తుం టాయి ప్రైవేట్ ఆస్పత్రులు. ఈ నేపథ్యంలో ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపుతూ అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ప్రభుత్వ ఆస్ప త్రిలో ఫోటోథెరపీ యూనిట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మొత్తం ఆరు ఫోటోథెరపీ యూనిట్లను ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఒకేసారి ఆరుగురు పిల్లలకు వైద్యం అందించేందుకు వీలవుతుందని ఆస్ప త్రి వర్గాలు వెల్లడించాయి.సాధారణంగా కామెర్లు సోకిన శిశువులను రెండు నుంచి మూడు రోజుల పాటు ఈ ఫోటోథెరపీ యూ నిట్లలో ఉంచుతారు. కేవలం తల్లిపాలు తాగే సమయంలో మాత్రమే బయటకు అను మతిస్తారు. ఈ ఫోటోథెరపీ చికిత్స ద్వారా కామెర్లు నయమవుతాయని ఆస్పత్రి వైద్యులు చెప్తున్నారు. మరోవైపు పుట్టుకతోనే కామెర్లు ఉన్న శిశువులను విశాఖ కేజీహెచ్ ఆస్పత్రికి పంపిస్తామని ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

# అమెరికాలో బొబ్బిలి టెకీ మృతి.. పుట్టినరోజు నాడే విషాదం



**అమరావతి:**అమెరికాలో విషాదం నెలకొంది. ఏపీకి చెందిన యువకుడు స్నానానికి చెరువులో దిగి మరణించాడు. పుట్టిన రోజు నాడే ప్రాణాలు కోల్పో వడంతో అతని స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్, రమ దంపతుల కుమారుడు సాయి శ్రీ హరికృష్ణ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. చదువు పూర్తి కాగానే మూడు నెలల కిందట అక్కడే ఉద్యోగం కూడా సంపాదించాడు. ఇదిలా ఉంటే శనివారం తన పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. అక్కడే చెరువులో స్నానం చేస్తుండగా అందులో మునిగి చనిపోయాడు.

# దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతి సస్పెన్షన్‌పై వేటు



**అమరావతి:**దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతిపై సస్పెన్షన్ వేటుపడింది. ఆదా యానికి మించిన ఆస్తులు ఉన్నట్లుగా ఏసీబీ కేసు నమోదైన నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామ చంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారం మేరకు శాంతిపై ఈ నెల 6వ తేదీన కేసు నమోదు చేశారు. అనంతరం 7వ తేదీ ఉదయం శాంతికి సంబంధించిన ఆస్తులపై మూడు చోట్ల తనిఖీలు చేశారు. వీటిలో రూ.1.37 కోట్ల మేర ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను అదే రోజు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా.. ఈ నెల 21 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. అనంతరం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

ఏపీ సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి కస్టడీలో ఉంటే వాళ్లను సస్పెండ్ చేయాలి. ఈ నేపథ్యంలోనే సహాయ కమిషనర్ శాంతిని సస్పెండ్ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 7 నుంచే అమలులోకి వచ్చాయని తెలిపారు.

# ఏపీలో భూములకు ఆన్‌లైన్ రికార్డ్ లాకింగ్.. చాలా సింపుల్, రైతులు ఇలా చేస్తే చాలు

**అమరావతి:**ఏపీలో భూ రికార్డులకు ఆన్‌లైన్ లాక్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. పట్టాదారుల హక్కుల పరిరక్షణకు ఈకేవైసీ, ఆధార్ అనుసంధానంతో అమలు చేయనున్నారు. ఒకవేళ ఎవరైనా వివరాలు మార్చాలని ప్రయత్నిస్తే వెంటనే రైతు మొబైల్‌కు మెసేజ్ వెళుతుంది. ఈ మేరకు రికార్డు లాకింగ్ మెకానిజాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. లాకింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులు, ప్రజల భూముల రికార్డులకు




సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై భూములకు సంబంధించి యజమానులు వెబ్‌ల్యాండ్‌లో రికార్డులకు లాకింగ్ మెకానిజం తీసుకొచ్చింది. ఒకసారి భూములకు సంబంధించి లాక్ చేస్తే.. యజమాని అనుమతి ఉంటేనే ఆ భూమి మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లకు అనుమతి ఉంటుంది. ఈ మేరకు పట్టా భూముల 1బీ, అడంగల్‌ను లాక్ చేసుకునే విధానం అందుబాటులోకి వచ్చింది. ఒకవేళ ఎవరైనా అక్రమంగా భూమిని ఏదైనా తారుమారు చేయాలనుకుంటే రైతు మొబైల్‌కు మెసేజ్ వెళుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ రికార్డ్ లాకింగ్ మెకానిజాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో ఈ సేవ అందు బాటులోకి వచ్చింది. ఈ మేరకు మార్గదర్శకాలు కూడా జారీ అయ్యాయి. అయితే ఈ లాకింగ్ ప్రభావం కౌలుదారులకు సంబంధించిన సేవలపై ఉండదు.ఈ రికార్డ్ లాకింగ్ విధానం కోసం భూమికి సంబంధించిన యజమాని స్వర్ణ గ్రామ, స్వర్ణవార్డు సచివాలయాలకు వెళ్లాలి. అక్కడ వీఆర్వో ఐరిస్, వేలిముద్రలు, ఫేస్ రికగ్నేషన్‌తో ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. మొబైల్ ఓటీపీ ద్వారా ఈ ప్రక్రియకు అనుమతి లేదు. ఈ ప్రక్రియలో వెబ్‌ల్యాండ్‌లో యజమానికి సంబంధించిన భూమి వివరాలు ఆధార్‌తో లింక్ అయ్యాయో లేదో పరిశీలిస్తారు.

# కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వాహనాలకు అనుమతి.. 56 కిమీ దూరం తగ్గింది, విశాఖపట్నం టు హైదరాబాద్ 8 గంటలే



**అమరావతి:**తెలుగు రాష్టాలను అనుసంధానం చేస్తున్న దేవరపల్లి టు ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి. అయితే ఈ కొత్త హైవేపై వైరా వరకు ట్రయల్ రన్‌కు అధి కారులు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఈ హై వేపైకి వాహనాలను అనుమతిస్తున్నారు. ఖమ్మం దగ్గర కొన్ని పనులు పెండింగ్ ఉన్నాయి.. అందుకే ఈ హైవేను పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. ఈ హైవేతో విశాఖపట్నం నుంచి హైదరాబాద్ త్వరగా వెళ్లొచ్చు.

ఆంధ్రప్రదేశ్ తెలంగాణను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్-365బీజీ)పై వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి నుంచి తెలంగాణలోని ఖమ్మం వరకు మొత్తం 162 కి.మీటర్ల నాలుగు లైన్ల హైవేలో వైరా వరకు పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి నుంచి వైరా (సోమవరం) వరకు వాహనాలను హైవేపైకి అనుమతిస్తున్నారు. ఈ హైవేలో స్టాపర్లు తొలగించి ట్రయల్ రన్‌కు వాహనాలను అనుమతిస్తున్నారు. విశాఖపట్నం నుంచి ఖమ్మం, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు ఈ కొత్త హైవేపై నుంచి వెళుతున్నారు. ఈ హైవేకు సంబంధించి ఖమ్మం దగ్గర కొన్ని పనులు పూర్తికాలేదు.. అందుకే ఖమ్మం వరకు వాహనాలను అనుమతించడం లేదు.ఈ హై వేలో టోల్‌ప్లాజాలు, సీసీ కెమెరాలు, ఫాస్టాగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ జాతీయ రహదారిలో ఎంత దూరం ప్రయాణిస్తే అంతవరకు టోల్ వసూలు చేస్తారు. అలాగే యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కావడంతో ఇంటర్ ఛేంజ్‌లు దగ్గర ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల నుంచి మాత్రమే వాహనాలు రాకపోలకు అవకాశం ఉంటుంది. ఈ హైవేపైకి లారీలు, బస్సులు, కార్లు, ఇతర భారీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.. బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లకు అనుమతి లేదు. ఈ జాతీయ రహదారిలో కార్లు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లొచ్చు.. లారీలతో పాటుగా ఇరత వాహనాలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయా ణించ ొచ్చు.హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లాలంటే విజయవాడ మీదుగా వెళ్లాల్సిందే.. 620కిపైగా 12 గంటల సమయం పడుతుంది.

# వైజాగ్ ఆఫీస్ ఇదే మంత్రి లోకేష్ ట్వీట్ వైరల్

**అమరావతి:** సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖపట్నం ఇప్పుడు గ్లోబల్ ఐటీ హబ్‌గా మారే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఐటీ సంస్థ తన నూతన కార్యాలయాన్ని విశాఖలోని ప్రతిష్టాత్మకమైన లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఏర్పాటు చేసింది. ప్రముఖ కో-వర్కింగ్ స్పేస్ ప్రొవైడర్ భాగస్వామ్యంతో ఈ సెంటర్ కార్యకలాపాలు సాగనున్నాయి. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ విషయాన్ని వేదికగా ధృవీకరిస్తూ.. హ్యాష్‌ట్యాగ్‌తో సాగరనగరానికి సాదరంగా ఆహ్వానించారు.గత కొన్నేళ్లుగా ఐటీ కంపెనీల రాక లేక వెలవెలబోయిన విశాఖకు, ×దీవీ రాక కొత్త ఊపిరి పోసింది. సాధారణంగా ×దీవీ వంటి దిగ్గజ సంస్థ ఒక నగరంలో అడుగు ెట్టిందంటే, దానిని అనుసరించి అనేక అనుబంధ సంస్థలు, ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు కూడా అటువైపే మొగ్గు చూపుతాయి. ఇది విశాఖను ఐటీ గమ్యస్థానంగా మార్చడంలో




కీలక పాత్ర పోషించనుంది.ఉత్తరాంధ్ర యువతకు గొప్ప అవకాశం..

×దీవీ తన గ్లోబల్ డెలివరీ సెంటర్ల ద్వారా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, కన్సల్టింగ్ సేవలను అందిస్తుంది. తాజా సెంటర్ ప్రారంభంతో వందలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు స్థానికంగానే ఉపాధి లభించనుంది. ఫలితంగా ఉత్తరాంధ్రకు చెందిన యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా, సొంత గడ్డపైనే అంతర్జాతీయ స్థాయి కెరీర్‌ను నిర్మించుకునే అవకాశం లభించింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి లోకేష్ స్వయంగా అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుండటం, ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత ఉండటంతో ఫలితాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. ×దీవీ రాకతో విశాఖ ఐటీ రంగం మళ్ళీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని ఐటీ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గోదావరి పుష్కరాల ముహూర్తం, నిర్వహణ పై ప్రభుత్వం కీలక ప్రకటన


**గోదావరి:** గోదావరి పుష్కరాల ముహూర్తం ఫైనల్ అయింది. అనేక చర్చల తరువాత పండితుల సూచనల మేరకు ముహూర్తాన్ని ఖరారు చేసా రు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్క రాల కు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కేంద్రం నిధులను మంజూరు చేసింది. రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం పనుల నిర్వహణ కోసం కమిటీ ప్రకటించింది. కాగా, పుష్కరా లు ఖరారు అయ్యాయి. ఈ సారి గోదావరి పుష్కరాలకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి.గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు ఈ పుష్కరాలను నిర్వహించాలని సర్కారు నిర్ణయించారు. దాదాపు 8 కోట్ల మంది భక్తుల వస్తారన్న అంచనాతోపాటు, ప్రత్యేక



రోజుల్లో గరిష్ఠంగా 75,000 మంది వరకూ వస్తారని భావిస్తున్నారు. కాగా, గోదావరి పుష్క రాలకు పలు దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. అన్ని దేవాలయా లను పున: నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బ ందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఇప్పటికే మూడు సమీక్ష సమావేశాలు జరిగాయని తెలిపారు. పుష్కరాలకు సం బంధించి రాజమండ్రిలో రూ.9.55 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశామని వివరించారు. రాజమండ్రితోపాటు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలను గోదావరి పుష్కరాలకు అభివృద్ధి చేస్తామని చెప్పారు.కుంభమేలా తరహాలో ప్రభుత్వం ఏర్పాట్లుకాగా, ఇప్పటికే 43 దేవాలయాల పున: నిర్మాణం కోసం రూ.51 కోట్ల నిధులు మంజూరు చేశామని మంత్రి ఆనం తెలిపారు. హాజరయ్యే భక్తుల అంచనాతోపాటు వివిధ సౌకర్యాల గురించి చర్చలు జరిపారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, చూస్తుంది.


# నా తండ్రి తప్పు చేస్తే.. నన్ను తిడుతూ ఎందుకు కామెంట్స్ పెడుతున్నారు.. మాచర్ల ఏఎస్సై కూతురు

**పల్నాడు జిల్లా :**ఏపీలో పల్నాడు జిల్లా లోని పర్యాటక ప్రాం తాల్లోని పార్కుల్లో ఏకాంతంగా గడుపుతున్న జంటలను మాచర్ల ఏఎస్సై శ్రీనివాస్ రహస్యంగా వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఏఎస్సై దందాకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.ఇదిలా ఉంటే నిందితుడైన ఏఎస్ఐ శ్రీనివాస్ చేసిన తప్పుకు అతని కూతురు, యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ నందిని ట్రోల్స్ రౌండప్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నా తండ్రి తప్పు చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి కానీ నా వీడియోల కింద నన్ను తిడుతూ కామె ంట్లు ఎందుకు పెడుతున్నారంటూ నందిని వాపోయింది. ఈ మేరేకు నందినీ ఓ వీడియోను షేర్ చేసింది.నేను



డ్రోన్‌తో ప్రేమ జంటల వీడియోలు తీసి మా నాన్నకు ఇచ్చినట్లు ప్రూఫ్స్ ఉన్నాయా..? ఉంటే అవి తీసుకొని నా దగ్గరికి రండని కామెంట్స్ పెడు తున్న వారిని సవాలు విసిరింది. యూట్యూబ్‌లో తన వీడియోల కింద అసభ్యకరంగా కామెంట్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన నందిని తన వీడియోల కింద తిడుతూ కామెంట్లు పెడుతున్న ఎవ్వరిని వదిలి ఎట్టను అంటూ వార్నింగ్ ఇచ్చింది.ఏఎస్సై శ్రీనివాస్ మాచర్ల నియోజకవర్గ పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే ప్రేమికులు, కళాశాల విద్యార్థులే లక్ష్యంగా దందాలకు పాల్పడుతున్నాడు. జమ్మల మడ ుగుకు చెందిన ఓ ఆటోడ్రైవర్‌తో జంటలు సన్ని హితంగా ఉన్న వీడియోలు తీయించి, వారిని స్టేషన్‌కు తీసుకెళ్తానంటూ వసూలు చేస్తున్నాడు.

# తిరుమల ప్లాన్ చేసుకుంటున్న వారికి రైల్వే బిగ్ అప్డేట్, కొత్తగా అందుబాటులలోకి



**తిరుమల:** తిరుమల భక్తులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. వేసవిలో సాధారణంగా తిరుమలకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పెర ుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను ప్లాన్ చేసారు. రెగ్యులర్ రైళ్లలో ఇప్పటికే వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది. దీంతో.. పలు ప్రాంతాల నుంచి తిరుపతికి రైళ్లను ఖరారు చేసారు. స్పెషల్స్ రైళ్లను రెగ్యులర్ మార్పు చేస్తూ నిర్ణయి ంచారు. ఈ మేరకు అధికారులు స్పష్టత ఇచ్చా రు.తిరుపతికి వేసవిలో ప్రత్యేక రైళ్లను అధి కారులు ప్రకటించారు. అందులో భాగంగా తిరుపతి-చర్లపల్లి, చర్లపల్లి-తిరుచానూరు, తిరుపతి-అకోలా, నాందేడ్-తిరుచానూరు, కాకినాడ టౌన్-మైసూర్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఈ రైళ్లు ఉండ నున్నాయి.

# ప్రజలు సహకరించాలి, ఏపీ ప్రభుత్వం ప్రత్యేక వినతి

**అమరావతి:**రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక వినతి చేసింది. జనగణన వేళ సహకరించాలని కోరింది. ఈ మేరకు జనగణన పై మార్గద ర్శకాలు జారీ అయ్యాయి. దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి కేంద్ర ప్రభు త్వం సన్నాహాలు చేపట్టింది. నిబంధనల ప్రకా రం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధి కారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని ఏపీ ప్రభుత్వం తెలిపింది. జనగణన కోసం ప్రజల నుంచి సేకరించే సమాచారం పై స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రి యకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జనగణన నిర్వ హణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్ప నిసరిగా సహకరించాలని



ప్రభుత్వం సూ చిం చింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అంది ంచాలని తెలిపింది. అలాగే, సెన్సస్ అధి కారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది.మార్గదర్శకాలు జారీ

అదే విధంగా ఇంటి యజమానులు సెన్సస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, ఇళ్లకు వేసే గుర్తులు లేదా నంబర్లు తొలగించడం నేరమని స్పష్టం చేసింది. అలాగే సెన్సస్ ఫారమ్‌లను సరిగ్గా నింపడం కూడా ప్రజల బాధ్యతగా పేర్కొంది. సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన అధికారులకు సహక రించని వారికి రూ.1000 వరకు జరిమానా విధించే అవ కాశం ఉందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా ఉండొచ్చని హెచ్చరించింది. అయితే, జనగణన కోసం సేకరించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు పరిశీలించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసింది. జనగణన ప్ర క్రియ విజయవంతంగా అత్యంత పేర్కొంది.




# 'జన నాయగన్' లీక్..

## మాకేం సంబంధం లేదన్న సెన్సార్ బోర్డ్


దళపతి విజయ్ నటిస్తున్న 'జన నాయగన్' సినిమా లీకేజీ వ్యవహారంలో తమ ప్రమేయం ఉందంటూ వస్తున్న ఆరోపణలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవాస్తవమని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) మహారాష్ట్ర అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా సీబీఎఫ్‌సీ ఒక ప్రకటన విడుదల చేసింది.'జన నాయగన్' సినిమా డిజిటల్ సినిమా ప్యాకేజీ (డీసీపీ)ని మార్చి 17నే ముంబైలో నిర్మాతలకు అప్పగించామని, అప్పటి నుంచి అది వారి వద్దే ఉందని సీబీఎఫ్‌సీ తెలిపింది. సినిమా కంటెంట్ పాస్‌వర్డ్ ప్రొటెక్టెడ్ అని, దానికి సంబంధించిన కీ డెలివరీ మెసేజ్ (కేడీఎం) కేవలం నిర్మాత వద్ద మాత్రమే ఉంటుందని వివరించింది. ఆ కీ లేకుండా సినిమాను చూడటం గానీ, యాక్సెస్ చేయడం గానీ సాధ్యం కాదని పేర్కొంది.

ఇటీవల 'జన నాయగన్' సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలు ఆన్‌లైన్‌లో లీక్ కావడం తీవ్ర దుమారం రేపింది. కొంత కాలంగా సెన్సార్ బోర్డుతో ఉన్న విభేదాల కారణంగా ఈ సినిమా విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే లీకేజీ వెనుక సీబీఎఫ్‌సీ హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పైరసీ ఘటనను రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, రిషబ్ శెట్టి, విజయ్ దేవరకొండ వంటి పలువురు సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. విజయ్‌కు, చిత్ర బృందానికి తమ మద్దతు ప్రకటించారు. మరోవైపు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. లీకైన కంటెంట్‌ను చూడటం, షేర్ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించింది. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ఏ మాధ్యమంలోనూ ఈ క్లిప్స్‌ను సర్క్యులేట్ చేయవద్దని కోరింది

## స్పీడ్ పెంచిన కయాదు లోహర్..

ఈ మధ్యకాలంలో హీరోయిన్స్ భాషతో సంబంధం లేకుండా.. వివిధ భాషలలో వరుస అవకాశాలు అందుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా భాషతో పట్టింపు లేకుండా కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు ఆదరిస్తున్న సమయంలో అటు సెలబ్రిటీలు కూడా మంచి ఓరియెంటెడ్ కథలతో పాన్ ఇండియా స్టేటస్ ను సొంతం చేసుకుంటూ ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే మోడల్ గా తన కెరీర్ ను మొదలుపెట్టి.. ఆ తర్వాత కన్నడ చిత్రం ద్వారా ప్రేక్షకులకు పరిచయమై ఇప్పుడు వరుస సినిమాలతో బిజీగా మారింది కాయాదు లోహర్. 2021 లోనే తన కెరియర్ ను మొదలుపెట్టిన కాయాదు లోహర్ 2025లో వచ్చిన డ్రాగన్ సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చింది . అంటే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకోవడానికి సుమారుగా నాలుగు సంవత్సరాల సమయం పట్టింది అనడంలో సందేహం లేదు. అయితే అలా తక్కువ సమయంలోనే పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె ఇప్పుడు పల్లి చట్టంబి అనే మలయాళం చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టోవినో థామస్, కాయాదు లోహర్ జంటగా డిజోజోస్ ఆంటోనీ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఏప్రిల్ 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా ఇప్పుడు మంచి సక్సెస్ అందుకోవడంతో ఈమె తదుపరి సినిమాల జాబితా సోషల్ మీడియాలో





# మరో ఆసక్తికర కథతో తిరువీర్..

## 'పాపం ప్రతాప్' ట్రైలర్

'మసూద', 'పరేషాన్', 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్'వంటి విభిన్న చిత్రాలతో నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తిరువీర్, ఇప్పుడు 'పాపం ప్రతాప్' అనే మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ నెల 17న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.ఇది ఒక సామాన్య యువకుడి జీవితంలో జరిగే వింతైన, వినోదాత్మకమైన సంఘటనల చుట్టూ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. టైటిల్‌కు తగ్గట్టుగానే ప్రతాప్ అనే హీరో పాత్ర పడే కష్టాలు, అతడి చుట్టూ ఉండే పరిస్థితులు ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తూనే, కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. తన సహజమైన నటనతో ఆకట్టుకునే తిరువీర్, ఈ సినిమాలో కూడా తనదైన శైలిలో మెప్పించనున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది.ట్రైలర్‌లోని విజువల్స్, నేపథ్య సంగీతం సినిమా మూడ్‌ను చక్కగా ప్రతిబింబించాయి. కేవలం వినోదమే కాకుండా కథలో ఏదో బలమైన అంశం కూడా ఉందని ట్రైలర్‌ను బట్టి చెప్పొచ్చు. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎస్.పీ దుర్గ నరేశ్ దర్శకత్వం వహిస్తుండగా, పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తున్నారు.

# రణబాలి సెట్స్ పై సంబరాలు




వివాహ బంధంతో ఒక్కటైన తర్వాత నూతన దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మళ్లీ కెమెరా ముందుకు వచ్చారు. తాము కలిసి నటిస్తున్న 'రణబాలి' సినిమా షూటింగ్‌లో ఈ జంట పాల్గొంది. పెళ్లి తర్వాత తొలిసారి సెట్స్‌లో అడుగుపెట్టిన వీరికి చిత్ర యూనిట్ ఘనంగా స్వాగతం పలికి, సంబరాలు జరిపింది. బొకేలు ఇచ్చిన యూనిట్ సభ్యులు విషెస్ తెలిపారు. అంతేకాదు, కొత్త జంటతో కేక్ కట్ చేయించి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల తర్వాత విజయ్, రష్మిక కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. వీరి పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్న మొదటి సినిమా కావడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.19వ శతాబ్దపు రాయలసీమ చారిత్రక సంఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ 'రణబాలి' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, రష్మిక 'జయమ్మ' పాత్రను పోషిస్తోంది. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన కీలక షెడ్యూల్‌ను రాయలసీమ ప్రాంతంలో పూర్తి చేశారు.అద్భుతమైన తారాగణం, భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న 'రణబాలి' చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.

# సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర



తన అత్యద్భుతమైన సుమధర గానంతో 8 దశాబ్దాలకు పైగా అశేష శ్రోతక లోకాన్ని పరవశించిపోయేలా చేసిన గానకోకిల మూగబోయింది. సంగీత ప్రియుల మనసులపైనే కాదు యావత్ సంగీతం ప్రపంచంలోనే+ తనదైన ముద్ర వేసి, ప్రత్యేకత చాటుకున్నారు ఆశాభోంస్లే.

తీరాన్ని అలల తాకినట్లు ఆమె జీవితాన్ని కష్టాలు వెన్నంటినా.. ఆత్మవిశ్వాసంతో వాటిని అలవోకగా దాటి, తన అద్భుతమైన గాత్రంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.

సుదీర్ఘ సంగీత ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించి భవిష్యత్ తరాలకూ మార్గదర్శిగానూ నిలిచారు.

1943లో గాయనిగా తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆశాభోంస్లే నిరంతరాయంగా పాటలు పాడి బాలీవుడ్‌లో అగ్ర గాయనిగా పేరొందారు. హేమాహేమీల్లాంటి గాయనీ మణులున్నా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని 1000కి పైగా సినిమాల్లో 14 భాషల్లో దాదాపు 12,000కి పైగా పాటలు పాడి, అలరించారు.

సినీ రంగానికి సంబంధించి ఎన్నో అవార్డులతో పాటు అత్యధిక పాటలు పాడిన గాయనిగా గిన్నీస్ బుక్ రికార్డుల్లో స్థానం సొంతం చేసుకున్న ఆశాభోంస్లే 1933లో మహారాష్ట్రకు చెందిన సాంగ్లీలోని గోర్ అనే చిన్న గ్రామంలో సంగీత కుటుంబంలో జన్మించారు. నాన్న దిననాథ్ మంగేష్కర్ నటుడు, గాయకుడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వారిలో లతామంగేష్కర్ ఆశాభోంస్లే.. అక్కాచెల్లెళ్ళు. ఈ ఇద్దరికీ పుట్టుకతోనే సంగీతంపై మక్కువ ఉంది. చిన్నప్పట్నుంచి సరదాగా పాటలు పాడుతున్న క్రమంలో పదేళ్ల వయసులోనే అనుకోకుండా మరాఠీ సంగీత దర్శకుడు దత్తా దేవ్‌జేకర్ మరాఠీ చిత్రం



'మజా బల్' చిత్రంలో 'చలా చలా నవ్ చలా' అనే పాట పాడే అవకాశం ఇచ్చారు. ఈ పాటకు మంచి ఆదరణ రావడంతో ఆ తర్వాత అడపాదడపా కొన్ని అవకాశాలు వచ్చాయి. కాని ఏదీ పెద్దగా పేరు తేలేకపోయాయి. దాదాపు ఐదేళ్ల తర్వాత బాలీవుడ్ చిత్రంలో పాడే అవకాశం వచ్చింది.

క్లాసికల్, గజల్స్, రొమాంటిక్ ఇలా అన్ని రకాల పాటలను సునాయాసంగా పాడగలగడం ఆశాకు దేవుడిచ్చిన వరం. అంతేకాదు మూసధోరణి గాత్రానికి కూడా గుడ్‌బై చెబుతూ గాత్రంలో సరికొత్త ప్రయోగాలు చేశారు. పాశ్చాత్య పాటలను సైతం తనదైన శైలిలో పాడి, అలరించారు.

ఓ.పి.నయ్యార్ సంగీత దర్శకత్వంలో వచ్చిన 'సి.ఐ.డి' చిత్రంతో భోంస్లే వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి రాలేదు. వీరి కాంబినేషన్‌లో 'హౌరాబ్రిడ్జ్', 'ముంతాజ్', 'కిస్మత్', 'మేరే సనమ్', 'జంగ్లీ నహీ దేఖా', 'ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా', 'కాశ్మీర్ కి కలి' వంటి హిట్ చిత్రాలొచ్చాయి. వీటిల్లో 'హౌరా బ్రిడ్జ్' చిత్రంలోని 'ఆయిరే మెహెర్‌బాన్..', అనే పాట, 'ముంతాజ్'లో 'యె హై రేష్మి జుల్ఫియోంకా అంధేరా..', 'కిస్మత్'లోని 'ఆవో హుజూర్ తుమ్‌కో..', 'మేరే సనమ్' చిత్రంలోని.. 'జాయే ఆప్ కహాఁ', 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో' వంటి తదితర ఎన్నో పాటలు సంచలనం సృష్టించాయి.

ప్రసిద్ధ గాయని గీతాదత్‌తో పరిచయం భోంస్లే జీవితాన్నే మార్చేసింది. 'నయాదౌర్' సినిమా భోంస్లేకు కమర్షియల్‌గా సక్సెస్‌నిచ్చింది. ఇందులో పాటలన్నీ హిట్ కావడంతో భోంస్లే దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. 'గుమ్రాహ్', 'వక్త్', 'హమ్రాజ్', 'ఆద్మీ ఔర్ ఇన్సాన్', 'ధుండ్' వంటి చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్ చిత్రాలుగా నిలువడంతోపాటు ఆమె పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. అలాగే రాహుల్ దేవ్ బర్మన్, ఖయ్యూం, రవి, సచిన్ దేవ్ బర్మన్, ఇళయరాజా, ఏ.ఆర్.రెహ్మాన్, జైదేవ్, శంకర్-జై కిషన్, అనుమాలిక్ వంటి అగ్ర సంగీత దర్శకులతో ఎన్నో హిట్ చిత్రాల్లో పాటలు పాడి అగ్ర గాయనిగా తన స్థానాన్ని పదిల పర్చుకున్నారు.

యుక్తవయసులోనే ప్రేమ వివాహం, గర్భిణిగా ఉన్న సమ యంలో భర్త గణపతిరావ్ భోంస్లే దూరం కావడంతో.. ఒక దశలో ఆత్మహత్యకు యత్నించినా, మృత్యువుని తప్పించు కున్నారు. 1980లో సంగీత దర్శకుడు ఆర్.డి.బర్మన్‌ను ద్వితీయ వివాహం చేసుకున్నారు.

కెరీర్ పరంగా అత్యున్నత స్థానంలో కొనసాగుతున్నా, జీవితంలో మాత్రం ఆమె ఎన్నో కష్టాల్ని చవిచూశారు. అయినప్పటికీ వేటికి భయపడకుండా ధైర్యంగా ఆ కష్టాలను దాటుతూ అప్రహ తితంగా గాయనిగా జైత్రయాత్ర చేశారు.

రికార్డ్ స్థాయిలో ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేసి 'గ్రామీ' లాంటి పలు అంతర్జాతీయ మ్యూజిక్ అవార్డులందుకున్నారు.

'దిల్ చీజ్ క్యా హై' (ఉమ్రావ్ జాన్), 'మేరా కుచ్ సనమ్ (ఇజా జత్) పాటలకు గానూ రెండు జాతీయ అవార్డులు, 2000 సంవత్సరంలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, అమరావతి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్‌ని పొందారు.

2011లో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించు కున్నారు. 8 దశాబ్దాలకు పైగా అవిశ్రాంతంగా అద్భుతమైన పాటలు పాడిన ఈ గానకోకిల శాశ్వతంగా మూగబోవడాన్ని ఆమె అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## మూగబోయిన గాన కోకిల..

ఆశా భోంస్లే పాటలు మధుర జ్ఞాపకాలంటూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఆమెతో, ఆమె పాటలకు తమకి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆశాభోంస్లే మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆమె జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి.

**ప్రధాని నరేంద్ర మోదీ**

ప్రముఖ గాయని, జాతీయ పురస్కార గ్రహీత, పద్మ విభూషణ్ ఆశా భోంస్లే లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. భార తీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలు, దశా బ్దాల పాటు పలు భాషల్లో ప్రదర్శించిన అపూర్వ ప్రతిభ చిరస్మర ణీయం. ఆమె మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఆశాభోంస్లే గాత్రం తరతరాల పాటు అనేక రకాల భావోద్వే గాలను పలికిస్తూ, భారతీయ సినిమాకు ప్రత్యేకంగా నిలిచింది. ప్రతి పాటకూ గ్రేస్ తీసుకువచ్చిన ఆమెను ఎప్పుడూ ఆరాధిస్తా. భారతీయ చిత్ర పరిశ్రమ భర్తీ చేయలేని ఓ స్వరాన్ని కోల్పోయింది. – **చిరంజీవి**

ప్రముఖ గాయని ఆశా భోస్లే కన్నుమూశారని తెలిసి చింతించాను. సుదీర్ఘ కాలం హిందీతోపాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ వంటి భాషల్లో సినీ గీతాలు ఆలపించిన మధుర గాయని ఆమె. పాశ్చాత్య సంగీత శైలి గీతాలను సైతం ఆలపించి ఒక తరం యువతను ఉర్రూతలూగించారు. 'దమ్ మారో దమ్, చురా లియా హై తుమ్నే, ఇన్ అంకో కి మస్తీ, రాధా కైసే న జలేఁ' లాంటి గీతాలతో సినీ, సంగీతాభిమానులను అలరించారు. తెలుగులో ఆశాజీ పాడిన గీతాలు తక్కువే అయినా హిందీ గీతాలతో తెలుగు రాష్ట్రాల్లో చిరపరిచితమే.

– **పవన్ కళ్యాణ్**

ఆశాభోంస్లే మరణ వార్త విని కన్నీటిపర్యంతమయ్యా. ఆమె మధురమైన స్వరం దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు ప్రాణంగా నిలిచి, లక్షలాది హృదయాలను తాకింది. తరతరాలు నిలిచిపోయే జ్ఞాపకాలను వదిలి వెళ్ళారు. ప్రేమ, గౌరవంతో ఆమెను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉంటాం. – **ఎన్టీఆర్**

# పబ్బతి వేణుగోపాల్ వ్యాపార రంగంలో ఎంతో అభివృద్ధి చెందాలి

▸రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

▸నీతి, నిజాయితీలతో వ్యాపార రంగంలో పబ్బతి వేణుగోపాల్ దూసుకెళ్తున్నాడు -ఏవి సుబ్బారెడ్డి

▸ఘనంగా పిఏవి గ్రూప్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం




**నంద్యాల ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్) :** దశాబ్దాల కాలం నుండి పి ఏ వి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ పట్టణంలో ప్రజల నమ్మకాన్ని పొందుతూ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేస్తూ ఎంతో మందికి ఉపాధి కల్పించడం అభినందనీయమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు ఆదివారం పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ నాగుల కట్ట సమీపంలో పి ఏ వి గ్రూప్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి ఎన్ ఎం డి ఫరూక్ విచ్చేశారు పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎన్ ఎం డి ఫరూక్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ అడ్వకేట్ అపర్ణ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరం లు గా పబ్బతి వేణుగోపాల్ పరిచయం వ్యక్తిగతంగాను వ్యాపార పరంగాను తనతో ఉన్నాయన్నారు హోల్ సేల్ కిరాణం దుకాణంతో ప్రస్థానం ప్రారంభించి రియల్ ఎస్టేట్ కన్స్ట్రక్షన్ మరిన్ని రంగాలలో కష్టపడి విజయాలు సాధిస్తూ వ్యాపార రంగంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని అభినందించాడు వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించి ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ విశ్వనాధ్ కమిషనర్ శేషన్న మున్సిపాలిటీలు ఏఈ లు తెలుగుదేశం పార్టీ జిల్లా సెక్రెటరీ ఎన్ ఎండి ఫిరోజ్, బిజెపి నాయకులు శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ మేడ మురళీధర్, మాజీ కౌన్సిలర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, ప్రథమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, కళారాధన అధ్యక్షులు ప్రముఖ వైద్యులు జి.రవికృష్ణ ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సీనియర్ పాత్రికేయులు మధుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ పట్టణ కార్యదర్శి జగన్మోహన్ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

### నీతి, నిజాయితీలతో వ్యాపార రంగంలో పబ్బతి వేణుగోపాల్ దూసుకెళ్తున్నాడు -ఏవి సుబ్బారెడ్డి

దశాబ్దాలుగా పట్టణంలో పిఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ తన నీతి నిజాయితీలతో వ్యాపార రంగంలో దూసుకెళ్తున్నాడని మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏ వి సుబ్బారెడ్డి అభినందించారు పి ఏవి కార్యాలయం ప్రారంభోత్సవం లో పాల్గొని పూజ అనంతరం పబ్బతి వేణుగోపాల్ అడ్వకేట్ అపర్ణ దంపతులకు శుభాకాంక్ష లు తెలిపారు వినియోగదారుల నమ్మకంతో వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు






# ఈ నెల 13న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

**వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు**




**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ నెల 13వ తేదీ (సోమవారం)న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా సమర్పించడమే కాకుండా, వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో కూడా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇంటర్ పాసైన విద్యార్థులకు రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్




**హైదరాబాద్, ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ మెరిట్ స్కాలర్షిప్ ప్రోగ్రాం కింద వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులు ఆన్ లైన్ లో నేర్చుకునేందుకు రూ.1లక్ష వరకు కోర్సు ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఇంటర్ మార్క్స్ గ్రేడింగ్ ఆధారంగా రూ.1లక్ష వరకు స్కాలర్ షిప్ కు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్కాలర్ షిప్ ప్రోగ్రాం కొరకు అభ్యర్థులు ఆన్ లైన్ వెబ్ సైట్: **www.nationalskillacademy.in** ద్వారా ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9505800047.

# రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి**



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని, పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణ మూర్తికి కళారాధన, లయన్స్ క్లబ్ సత్కారం

. వైష్ణవ వెంకటరమణమూర్తి సాహితీ సేవలు విశిష్టమైనవి: ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు

. ఉగాది పురస్కారాలు పునరుద్ధరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు: కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ.

**నంద్యాల ఏప్రిల్ 12( రిపబ్లిక్ న్యూస్) :**

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున నంద్యాల కు చెందిన సాహితీవేత్త వైష్ణవ వెంకట రమణమూర్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం స్వీకరించిన సందర్భంగా కళారాధన సాంస్కృతిక సంస్థ కార్యాలయంలో కళారాధన, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రవికృష్ణ పాల్గొని రమణమూర్తిని శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ రమణమూర్తి చేసిన విశిష్ట సాహితీ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించడం హర్షణీయమన్నారు. రమణమూర్తి అనేక కావ్యాలు రచించడమే కాకుండా పద్య సాహిత్య ప్రాచుర్యానికి చేసిన సేవలు విశిష్టమైనవనీ ప్రశంసించారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రమణమూర్తి చిన్నయ్య సూరి సాహితీ సంస్థ ద్వారా తెలుగు సాహిత్య ప్రాభావానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉగాది, కళా రత్న పురస్కారాలు గత సంవత్సరం నుండి కూటమి ప్రభుత్వం



పునరుద్ధరించడం పట్ల రాష్ట్రంలోని కళాకారులు సాహితీవేత్తలు, హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వివిధ రంగాల సేవలను గుర్తించి ఈ పురస్కారాలు అందించడానికి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు కవులు నరేంద్ర, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు రమణమూర్తి సాహితీ సేవలను ప్రస్తుతిస్తూ కవితా గానం చేశారు. రమణమూర్తి మాట్లాడుతూ తెలుగు పద్యం ప్రాచుర్యానికి తన జీవితమంతా కృషి చేయడం జరిగిందని, తన రచనల పైన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పరిశోధన గ్రంథం రూపొందిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్,సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య,ప్రముఖ తెలుగు కవులు, అధ్యాపకులు అవ్వారి శేష ఫణి,డాక్టర్ కురుమేటి కిషోర్, నరేంద్ర, నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, మహమ్మద్ రఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలను నమ్మవద్దు - త్రీ టౌన్ సిఐ



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 12, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి బెటింగ్ సమాచారం పై లాడ్జి చెకింగ్ నిర్వహించి తిరిగి వస్తుండగా, రైల్వే స్టేషన్ సమీపంలో మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి పోలీస్ వాహనంపై పడిన సంఘటన చోటుచేసుకుంది. విచారణలో అతను పోలీసులను దూషిస్తూ విధి నిర్వహణకు అడ్డంకిగా వ్యవహరించి, ఒక కానిస్టేబుల్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మరొక వ్యక్తి కూడా సహకరించినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. అనంతరం ఆ వ్యక్తి ఆసుపత్రిలో చేరి, పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు గుర్తించబడింది. పోలీసులు ఎటువంటి అనవసర బల ప్రయోగం చేయలేదని స్పష్టం చేస్తూ, ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఆసుపత్రిలో బాలికను పరామర్శించిన ఐసిడిఎస్ పిడి లీలావతి దేవి

**బనగానపల్లి ఏప్రిల్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

బనగానపల్లె పట్టణంలో 13 ఏళ్ల బాలిక పై జరిగిన అఘాయిత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి, బాలికను పరామర్శించి, ఈ కేసు లో ప్రభుత్వ స్పందనను వివరించారు.బాలికకు చికిత్స అందిస్తున్న ఏరియా హాస్పిటల్ లో ఆమెను కలసి, విక్టిమ్ కంపెన్సేషన్ కింద 25 వేల రూపాయలను అందజేసారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకోబడ్డాయి. అలాగే, ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ




ఆరా తీశారని, బాలికకు మెరుగైన వైద్యం అందించాలంటూ ఆదేశించినట్లు తెలిపారు.

బాలికకు చికిత్స పూర్తయిన తర్వాత, ఛార్జిషీట్ దాఖలు అయ్యాక మరో 25 వేలు, శిక్ష ఖరారయ్యాక 50 వేలు మళ్ళీ ఇవ్వనున్నట్లు కూడా వెల్లడించారు. ప్రభుత్వం బాధితురాలికి పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వం బాధితురాలికి పూర్తిస్థాయి మద్దతును అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో అధికారులు అనురాధ నాగసుంకమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com